# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



VOLUME 31 ISSUE 12
No. OF PAGES 40
AUGUST 2012

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో................................ ....... పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీ బాబూజీ ఉవాచ | 4 |
| శ్రీ మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| నేత్రార్పణ చేసిన మహాభక్తుడు | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 15 |
| భైరవుని ఓంకారం | 17 |
| పరిప్రశ్నేన సేవయా | 18 |
| శివానందలహరి | 19 |
| మౌన ధ్యాన సప్తాహ శిబిరం | 21 |
| తీరిన కోరిక | 23 |
| విషయ వాసన | 25 |
| జ్ఞాన నేత్రం | 27 |
| వ్యాసాశ్రమంలోశ్రీమాతాజీ – దృశ్యాలు | 28 |
| ఆషాఢపూర్ణిమ –దృశ్యాలు | 29 |
| అపరోక్షానుభూతి | 30 |
| ఆషాఢ పూర్ణిమ...... | 32 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 34 |
| రావణుని పూర్వజన్మ వృత్తాంతము | 36 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

"బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి"

వ్యాసభగవానుడు వ్రాసిన శ్లోకపాదము. ఇంద్రియగ్రామాలు బలవత్తరమైనవి. వాటి దగ్గర పాండిత్యముగాని, విద్యగాని, దాస్యం చేయవలసినదే. ఇది నగ్న సత్యం. వ్యాసులవారు వ్రాసిన శ్లోకపాదాన్ని చదివిన ఆయన శిష్యుడు జైమిని మహర్షి చదివి "ఏమిటో గురువుగారు యిలా వ్రాశారు. వయోభారం చేత అలా వ్రాసి ఉంటారు" అనుకొని దానిని "విద్వాంసో నాపి కర్షతి" గా సవరించాడు. వ్యాసులవారు దానిని చూసి తనలో తాను నవ్వుకొని జైమిని హృదయంపైన శాశ్వత ముద్రపడేలాగా చేశారు.

ఒకనాటి రాత్రి సమయంలో ఒక్క జైమిని మాత్రమే ఉన్న సమయంలో ఆకాశం అంతా మబ్బులు కమ్మి పెనుగాలులతోపాటు ఏకధారగా వాన ప్రారంభించింది. నల్లటి మేఘాల వలన కారుచీకటిగా ఉంది. ఒక్కసారిగా మెరుపు మెరిసింది. ఆ మెరుపులో ఎవరో స్త్రీ పర్ణశాల బయట వర్షానికి తడిసి ముద్ద అయి చలికి వణుకుతూ కనిపించింది. జైమిని తలుపుతీసి ఆమెని లోపలికి వచ్చి కూర్చోమన్నాడు. ఆమెను చూశాడు. జైమినికి అంతకు ముందు అంతటి సౌందర్యవతిని చూడలేదు. తనలో వింత అనుభూతులు కలిగాయి. ఆమె వద్దంటున్నా వినకుండా ఆమెను తన కౌగిట్లోకి చేర్చుకున్నాడు. తన హస్తముతో ఆమె చెక్కిళ్ళపై వ్రాయబోయాడు. చెక్కిళ్ళు గరుకుగా ఉన్నాయి. కళ్ళు తెరిచి చూశాడు. తన కౌగిట్లో ఉన్నది గురుదేవులు వ్యాసభగవానులు!

విషయం అవగతమైంది. మాటలు ఎన్నైనా చెప్పవచ్చు. ఎన్ని ప్రగల్భాలు అయినా పలకవచ్చు. ఏదైనా సమయం వచ్చినప్పుడు పరీక్ష ఎదురైనప్పుడు నిలబడితేనేగా అనుభూతి కలిగేది. జైమిని తాను సవరించిన శ్లోకభాగాన్ని యధాప్రకారంగా దిద్దాడు. ఇంద్రియగ్రామాలు శక్తిగలవని మహర్షులు చెప్పిన మాట యదార్థము కదా! గురుదేవుల మాట సత్యవాక్కు అనేది గ్రహించాడు జైమినిమహర్షి.

పరాశర ప్రసాద్
గౌరవ సంపాదకుడు

# యోగి వేమన

7. ఆలి మాటలు విని యన్నదమ్ముల రోసి
వేఱుపడుచునుండు వెఱ్ఱిజనుఁడు
కుక్కతోఁకఁబట్టి గోదావరీఁదును
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

భార్యమాటలు విని సోదరులతో పోరాడి వేరుగా పోవుట కుక్కతోకను పట్టుకొని గోదావరిని ఈద దలచిన రీతిని అనర్థమునే కలిగించును.

8. ఆసన మెఱుఁగక నామకర్మంబు
గురువుచేతఁ దెలిసి కూర్పకున్న
మనసు నిలుపకున్న మఱి ద్విజుండెట్లగు!
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు ద్విజుడైనను పద్మ, భద్రాదులైనా ఆసనములను, వాని పద్ధతిని గురువు మూలముగా తెలిసికొనడు. అవి తెలియని యెడల ద్విజుడెట్లగను?

9. పుట్టు ఘటములోనఁ బెట్టిన జీవుని
గానలేక నరుఁడు కాశికేఁగి
వెదకి వెదకి యతఁడు వెఱ్ఱియైపోవును
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు, తన దేహములోని జీవుడే పరమాత్మ అని తెలిసికొనలేక కాశి మున్నగుచోట్లకు ముక్తికై పోవును. అట్లు పోయి వెదకినవాడు వెఱ్ఱివాడు.

# శ్రీబాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

" సద్గురుదేవుడు తప్ప రెప్పపాటు కాలంలో ఉద్ధరించగల మహాత్ముడెవరు? తన గురుదేవుడి కృపను తలుచుకొని ఆర్ద్ర మనస్కుడైన సూరదాసు గొప్ప భావోద్వేగంతో పాడాడు.

గురు బిన ఐసే కౌన్ కరే?
సూర్ శ్యామ్ గురు ఐసే సమరథ్
క్షణమే లై ఉధరే!
గురుబిన ఐసే కౌన్‌కరే?



నిజమే. కన్నుమూసి తెరిచే వ్యవథి కంటే తక్కువ వ్యవధిలోనే, కాదు కాదు, తన కృపామృత తీక్షణ ప్రసారం జరిగిన ఆ క్షణంలోనే సద్యోముక్తిని ప్రసాదించగల అనన్య శక్తి సామర్థ్యాలు సత్యగురువులకేగాని, యితరులకు ఎన్నడూ కలుగవు. శిష్యుడికి బోధించే ముందు ఆ బోధనా విషయంలో గురువు ఉత్తీర్ణుడై ఉండాలి. తాము తగిన అనుభవం సంపాదించకుండా అది భౌతికం కానీండి, ఆధ్యాత్మికం కానీండి ఎవరూ రెండవ వారికి మార్గదర్శకులు కాలేరు. శిష్యుణ్ణి ముక్తుణ్ణి చెయ్యటానికి ముందు గురువు తాను స్వయంగా ముక్తుడయి ఉండాలి కదా?

సూరదాసు భక్తి , ధ్యానసాధనా ఎలాటివంటే పుట్టుగుడ్డిగా పుట్టిన అతడు ఎప్పుడు కావాలంటే అప్పుడు తమ మనో నేత్రంతో పరమ సుందరమైన బృందావనాన్నీ, తివాచీలాంటి శ్యామలమైన మత్తైన, మెత్తని పచ్చిక బయళ్ళనూ, మేత మేస్తున్న గోగణాలను, ఆనందంతో గంతులు వేస్తున్న లేగలనూ, వాటివెంట పరుగులు పెడుతున్న గోపబాలకులనూ, తన మధురాధరములతో పూరించి మంత్రజలంతో ప్రకృతిని మైమరపిస్తున్న నీలమేఘశరీరుడైన శ్యామసుందరుణ్ణి స్పష్టంగా, దగ్గరగా చూడగలిగిన శక్తికలది. అటువంటి పరమ రమణీయ దృశ్యాలనూ చూసి, పులకించి, ఆ భావోద్వేగంతో పాడిన గీతాలే సూరదాసు ఆలపించిన మహాసాహిత్యం. అటువంటి దివ్య దర్శనాలను పొందగలిగిన కన్నులే

కన్నులు. మిగిలినవన్నీ గాజుబుడ్లు. ఉన్నా ఒకటే, పోయినా ఒకటే.

ఒక రోజున సూరదాసుకు ఒక దివ్యదృశ్యం గోచరించింది. శ్యామసుందరుడు గోపికాగణం మధ్య పరమ సుందరంగా, నయన సుభగంగా నర్తిస్తున్నాడు. ఆ సుందర నీలమేఘచ్ఛాయ బృందావన సర్వస్వాన్ని శ్యామలంగా తయారుచేసింది. సూరదాసుకు ఏ వంక చూసినా శ్యామసుందరుడే దర్శనమిచ్చాడు. గోవులు, గోపబాలకులు, గోపికలు, వృక్షాలు, యమున, ఒక్కటేమిటి చివరకు ఆ దృశ్యాన్ని చూస్తున్న తాను కూడా శ్యామసుందరుడే! ఎక్కడా చీమ చిటుక్కుమనని నిశ్శబ్దం. ప్రశాంతి. చివరకు నీలమేఘ శ్యాముని వేణువు కూడా నిశ్శబ్ద సంగీతాన్నాలపించింది.

"ఏమైంది నాకు? ఎక్కడున్నాను నేను?" అని ఆశ్చర్యపోయాడు సూరదాసు. "ఇది నిజమేనా? కలా? నేను నిద్రపోతున్నానా? మెలకువగా ఉన్నానా?" అని ప్రశ్నించుకుని తనను తాను గిల్లుకుని నెప్పికి 'అబ్బా!' అనుకొని మెలకువలోనే ఉన్నానని నిర్ధారణ చేసుకున్నాడు. "అవును. నేను సూరదాసునే!" అనుకున్నాడు. కానీ తనకర్థంకాని రీతిలో తనలో ఏదో మార్పు వచ్చింది. తన తల చేతితో తడువుకొని ఆశ్చర్యపోయాడు!

"సగం ఊడిపోయి, మిగిలిన సగం అంటుకత్తెర వేయించిన బట్టతల బదులు నిగనిగలాడుతూ, మృదువుగా, పట్టుకుచ్చులా, ఉంగరాలు తిరిగిన కురులు, అలకలు! ఇదేమిటి? నెమలి పింఛమా! సంతోషంతో ఎగిరి గంతేశాడు. మామూలుగా కదలలేక, వయస్సుతో బలం ఉడిగి శక్తి విహీనమైన కాళ్ళుకావు. పరమ లఘువుగా, చెంగున ఎగరగలిగిన కాళ్ళు! తన చేతులు రోజూలాగ వణకటం లేదు. తన ముఖం మీద ముడతలు, వృద్ధాప్యం వచ్చిందని మృత్యువు వ్రాసిన ధృవపత్రపు రాతలూ, చేవ్రాళ్ళూ లేనేలేవు. పరమ స్నిగ్ధంగా లావణ్యంతో మెరుస్తున్న చెక్కిళ్ళు. దివ్యగంధ విలసితమై నాసాసుభగంగా ఉన్న దేహం. ఓహ్ ఏం పరిమళం! అరె యిదేమిటి! తన అంగవస్త్రం కాదే, పట్టు పీతాంబరం! బంగారు మొలత్రాడు! ఆ! అవును. ఇంతసేపు పట్టింది తనకర్థం కావటానికి! తాను వృద్ధుడూ, అంధుడూ అయిన సూరదాసు కాదు! తాను శ్యామసుందరుడు!

-సశేషం

# శ్రీ మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి)

-జపమాల ప్రసాద

ఇది ఎప్పుడు జరుగుతుంది? గురుపరమాత్మ తెలియచేసిన "హంస శివస్సోహమ్" అనే సూచన మంత్రాన్ని నిరంతరం అనుష్ఠానం చేసి, నిరంతర విచారణ చేయడం వలన, "ఆ పరమాత్మవస్తువే 'నేను' అని అజపగాయత్రి వలన తెలుస్తుంది. అప్పుడు సంశయములన్నీ రహితమై, అద్వైత తత్వం సుప్రతిష్ఠితమవుతుంది. ఆ జీవబ్రహ్మైక్య అనుసంధానాన్ని సూచనగా తెలియచేసేదే 'హంస శివస్సోహమ్' అనే సూచన మంత్రం. (అని శ్రీమాతాజీ ఈ కీర్తన గానం చేశారు......)



ప॥ హంసశివస్సోహవ్ పరమహంస సుకుమార భావ సమూహం

అ॥ప॥ సంశయ రహిత అద్వైత తత్వ భాసమాన సూచనమంత్ర వ్యూహం ॥హంస॥

చ॥ నాద బ్రహ్మాసక్త వినోదం – వేదాంత రహస్యార్థ ప్రబోధమ్

ఆదిశంకరాచార్యామోదం- హనుమత్ కాళీ వర ప్రసాదం

॥హంస॥

ఆ విధంగా నీలోనే వుండి నిన్ను ప్రకాశింపచేస్తున్న శివుడికోసం ఎక్కడెక్కడో కొండలు, గుట్టలు ఎక్కి ఏవేవో పువ్వులు కోసం పరుగులు పెడతావెందుకురా? అని శ్రీశంకరభగవత్పాదులవారు శివానందలహరిలో ఒక చక్కటి శ్లోకాన్ని అందించారు.

"గభీరే కాసారే విశతి విజనే ఘోర విపినే
విశాలే శైలే చ భ్రమతి కుసుమార్థం జడమతి
సమర్ప్యైకం చేత స్సరసిజ ముమూనాథ భవతే
సుఖేనా వస్థాతుం జన ఇహ నజానాతి కిమహో!"

"అసలు పుష్పం నీ దగ్గరేవుండగా బయటనుంచి గంపలెందుకురా? అన్నిటినీ కదిలించే నీ మనసుని నాకిస్తే, నీకు ఆత్మ సామ్రాజ్యాన్నిస్తానంటున్నాడా భగవానుడు. ఓ పార్వతీపతే! ఈ మానవుడు తెలివితక్కువవాడై పుష్పాలకోసం లోతైన చెరువులలోను, భయంకరారణ్యములలోను, ఎక్కడో పర్వతాలపైనను తిరుగుతున్నాడు! తన మనస్సనే పద్మమును నీకు సమర్పించి హాయిగా స్థిరముగా వుండవచ్చని తెలుసుకోలేకపోతున్నాడే, ఏమి ఆశ్చర్యము!" అని శ్రీశంకరులు వాపోతున్నారు. మన చలించే చిత్తాన్ని ఆ ప్రభువుకిచ్చుకోముగాని, అనేక కేజీల పూలు, పాలుతెచ్చుకొని వస్తాం. దాని వలన వుపయోగమేమిటి?

"శౌచం ఇంద్రియనిగ్రహః ధ్యానం నిర్విషయం మనః" అని చెప్తోంది స్కందోపనిషత్తు. ఇంద్రియాలని నిగ్రహించి, మనోమలాన్ని వదిలించుకుని, కూర్చునుండగా మనస్సుని నిర్వషయం చేసుకుని నిలబెట్టగలిగితే, అప్పుడు నిలుచున్నా, ఎక్కడ తిరుగుతున్నా కూడా మనసు నిలబడుతుంది. 'త్యాగేనైకే అమృతత్వమానసుః' అని అనుకున్నాం కదా? త్యాగం ఒక్క దానివలనే అమృతత్వం సిద్ధిస్తుంది. 'త్యాగం' అనేది మనంతట మనకి రావాలి – శివాజీ మహారాజు తన యావత్ రాజ్యాన్ని సమర్ధుల వారికి సమర్పించుకున్నాడు. మరిఅంతటి త్యాగ గుణం మనకున్నదా? రాజ్యాల సంగతి దేవుడెరుగు, కనీసం గుణాలనైనా త్యాగం చేస్తున్నామా?

ఒక మాతృమూర్తి తన సర్వస్వం తన బిడ్డలకోసం త్యాగం చేయడానికి ఎలా సిద్ధపడుతుందో, మీకొకవిషయం చెపుతాను. ఒక తల్లి తన పిల్లవాడు బస్సు క్రింద పడబోతూ వుంటే, తన ప్రాణాన్ని కూడా త్యాగం చేసి, అతడ్ని రక్షిస్తుంది.! ఆ పిల్లవాడి చేతిని గట్టిగా పట్టుకొని తీసుకువెళ్తూ వుంటుంది. ఆ పిల్లవాడు తల్లి పట్టును విదిలించుకోవాలని ఎంతో ప్రయత్నం చేస్తాడు. అయినా, ఆ తల్లి తన పట్టువదిలితే, పిల్లవాడు ఎక్కడ ప్రమాదానికి లోనవుతాడోనని, వదలదు. ఆ పిల్లవాడు ఏవేవో మాయమాటలు చెప్పి, తల్లిచేయి విడిపించుకుని, బొమ్మలతో ఆడుకోడానికి వెళ్ళిపోతాడు. మన పరిస్థితి కూడా యిప్పుడు అలానే వుంది. బొమ్మలాటల్లో పడిపోయి బ్రహ్మాని మర్చిపోతున్నాం. అశాంతికి గురయిపోతున్నాం. బ్రహ్మా వస్తువుని గురించి తెలిపే గురుదేవులు ప్రతివిషయంలోను "సౌమ్యం, సత్యం, శాంతం" అని బోధిస్తున్నారు. "శాంతములేక సౌఖ్యము లేనేలేదు" అని పాడేవారు శ్రీగురుదేవులు. ఈ 'శాంతం' ఎక్కడ్నుంచి వస్తోంది? బయట నుండా? కానేకాదు. మనలోనుండే వస్తున్నది. భగవన్నామం ద్వారా, మహాత్ముల వాక్కులు శ్రవణ, మననమును చేయడం ద్వారా, మన జన్మాంతర వాసనలు హరించి, శాంతం వస్తోంది. అదే సుకుమార భావాలనిస్తోంది. అందుకనే, "ఎవరైనా మంచి మాటలు చేప్తే ఒళ్ళంతా చెవులు చేసుకొని వినాలి. చెడుమాట్లాడితే మనకి చెవుడు రావాలి," అనేవారు శ్రీబాబూజీ. ఊహాపోహలకి దూరంగా వుండాలి.

మా గురుదేవులు మాకు సకల దేవతలు గాను దర్శనం ఇచ్చారు. ఇటువంటి క్షేత్రాలని దర్శింపచేసి క్షేత్రజ్ఞుడ్ని దర్శించాలనే వారు. ఒక భక్తుడు అస్మద్ గురు దేవులనీ విధంగా అడిగారు – "స్వామీ మీరు సాక్షాత్ భగవత్ స్వరూపులు కదా! మీరెందుకు యీ పూజలవీ చేస్తున్నారు?" అని. అప్పుడు స్వామి నవ్వి, "నేను చేస్తూ వుంటేనే మీరు చేయటం లేదే – ఇక నేను చేయడం మానేస్తే...." అన్నారు.

– సశేషం

(గతసంచిక తరువాయి)

# సన్నిధిలో సంభాషణ

-పరాశర ప్రసాద్

19-6-1985

ఈరోజు శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ మానవుడి పతనానికి కారణం ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం. ఒక గృహంలో ఏ ఇద్దరి మధ్యా సయోధ్య ఉండదు. ఒకరిని మరొకరు నమ్మరు. భార్యాభర్తలిద్దరూ ఉత్తర దక్షిణ ధృవాలు. ఇటువంటి వ్యక్తిత్వం ఉన్నవారికి ఎవరైనా వారి చెవులో విషబీజాలు నాటారనుకోండి ఇంక ఆ గృహం నరకమే. అది అలా ఉంచండి. ఇద్దరు వ్యక్తుల మధ్య విషబీజాలు నాటి వారిరువురికి మధ్య ద్వేషభావాన్ని కలిగించేవారు పాపకర్మ మూటకట్టుకొని అతి హీనమైన జన్మకి వస్తారు. అటువంటివారు కొండచిలువగానో, గజ్జికుక్కగానో, కుంటి నక్కగానో జన్మిస్తారు.

కాని భగవంతుని దివ్య నామ కవచము, భక్తి ధరించిన వారికి ఎన్ని విషబీజాలు నాటినా అవి ఆ కవచాన్ని ఛేదించలేవు. ఆ దివ్యశక్తి విషబీజాలను లోనికి ప్రవేశించనీయదు. ఆధ్యాత్మిక కవచము గృహాన్ని శాంతిగా ఉంచుతుంది. ఆధ్యాత్మిక దృష్టిలేని గృహం ఎలా ఉంటుందో ఒక దృష్టాంతాన్ని చెబుతాను. కోనసీమలో ఒక సంపన్న కుటుంబం ఉంది. ఇరువురు అన్నదమ్ములు ఆస్థిని పంపకాలు చేసుకున్నారు. తోడికోడళ్ళు ఇద్దరూ పెద్ద ఆస్థి వెంట తెచ్చుకుని కాపురానికి వచ్చారు. వారి వెంట పనివారిని కూడా తెచ్చుకున్నారు. ఇద్దరు అన్నదమ్ములు కోడళ్ళు అన్యోన్యంగానే ఉంటున్నారు. సంక్రాంతి పండుగ సమీపించింది. చిన్నకోడలు ఇంట పనివాళ్ళు ఇద్దరూ పిండి దంచుతున్నారు. చిన్న కోడలు పనిమనిషి చెప్పటం మొదలు పెట్టింది. ఈ రోకలి మా అమ్మగారికి వారి అత్తగారు ఇచ్చారు. దీని ద్వారానే మా అమ్మగారికి అదృష్టం కలిసి వచ్చింది. ఈ రోజు ఈ కుటుంబం నిలబడటానికి ఈ రోకలే కారణం అని విషబీజం నాటింది.

పెద్ద కోడలు పనిమనిషి ఈ విషబీజాన్ని వెంటనే పెద్దావిడకి అందజేసింది. పెద్దకోడలి పనిమనిషి మాట్లాడుతూ అమ్మగారూ! మీరు అయ్యగారూ ఉత్త అమాయకుల్ని చేసి మీ అత్తగారు మీకు చాలా అన్యాయం చేశారు. మన ప్రెస్టేజీ పోయిందమ్మా అని అన్నది. పెద్ద కోడలు మాట్లాడుతూ మన ప్రెస్టేజీకి ఏం తక్కువ? మనకి కావలసినంత ఆస్థి ఉంది. పాడి పంట బాగానే ఉంది. మనకి ఏం లోటు వచ్చింది? అని అడిగింది.

పనిమనిషి మాట్లాడుతూ మీ అత్తగారు వెంట తెచ్చుకున్న రోకలి ఎక్కడ ఉంటే ఐశ్వర్యం అక్కడ నిలుస్తుందిటండీ! పెద్దయ్యగారు, మీరు అమాయకులు కాబట్టి మీ అత్తగారు తెచ్చుకున్న రోకలి మీ తోడికోడలు గారు తీసుకున్నారుట. అందువలననే వారి కొబ్బరితోట చాలా బాగుందిట. తుఫాను వచ్చినా ఒక్క చెట్టు కూడా పడిపోలేదుట. మన తోటలో చాలా

చెట్లు పడిపోయాయి కదమ్మగారూ. మనం ఎంతో నష్టపోయాం అని విషబీజం వేసింది పనిమనిషి. ఇటువంటి చాడీలు చెప్పేవారు చనిపోయిన తరువాత సూక్ష్మశరీరంతో చెప్పరాని నరకబాధని అనుభవిస్తారు అన్నారు శ్రీబాబు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ ఇటువంటి చిల్లర తగాదాలు గాలివానయై తుదకు ఆకుంటుబం పతనానికి దారితీస్తాయి. పెద్దకోడలు ఊరుకుంటుందా తన భర్త ఏకాంతంగా ఉన్నప్పుడు విన్నారా! మీ మరదలు మనల్ని ఇద్దర్ని తెలివితక్కువ వాళ్ళ క్రింద జమకట్టిందిట. అందువల్లనే మీ అమ్మగారు తమ వెంట తెచ్చుకున్న రోకలిని మీ మరదలు తీసుకున్నారట. ఈ విషయంలో మీరు మీ తమ్ముడితో మాట్లాడి మీరు ఇంటికి పెద్దవారు కాబట్టి ఆ రోకలిని పొందే హక్కు మీకే ఉందని చెప్పి ఎలాగైనా ఆ రోకలి వచ్చేలాగా చూడండి అని భర్తకి నేపాళ మాత్ర పైత్యాన్ని నూరిపోసింది.

మనస్సు అసలు స్వాభావికంగా కోతి. అది త్రాగింది, పిచ్చి ఎక్కింది .ఇంకా కావలసినది ఏమున్నది? అన్నదమ్ములు ఇద్దరూ ఈ విషయమై తగువులాడుకొని చివరకి కోర్టులో దావా వేశారు. ఇరుపక్షాలవాళ్ళు లాయర్లకి ధనాన్ని వెచ్చించారు. జడ్జిగారు పైత్యం ముదిరిన ఇరువురి దున్నపోతులకి పరిష్కారమార్గంగా ఆ రోకలిని నిలువుగా చీల్చి ఇద్దరకూ ఇమ్మనమని తీర్పు ఇచ్చారు. రోకలికి ఉన్న పన్నుని కూడా పగుల గొట్టి సమానంగా పంచిపెట్టమని తీర్పు చెప్పారు. ఒకే తల్లికి పుట్టిన ఇద్దరి బిడ్డల మధ్య ప్రేమ ఎలా ఉందో చూశారుగా!

ఒక కుటుంబంలో ప్రేమను పెంపొందించుకోవాలంటే ఆధ్యాత్మిక చింతన ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. దారాపుత్రాదులు భగవచ్చింతన ద్వారా ఆధ్యాత్మిక శక్తితో నింపుకుంటే ఆ గృహమంతా శాంతి నిలయమై ఉంటుంది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులైన శ్రీమతి గూడూరి కళ్యాణమ్మగారు 2-7-2012 సోమవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరి వయస్సు 78 సంవత్సరాలు. వీరు తమ నేత్రములను దానం చేసిన ధన్య జీవులు! వీరికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు కలరు. శ్రీసద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఆగష్టు 2012**

1 బుధ రాఖీపూర్ణిమ, (జంధ్యాల పూర్ణిమ) రక్షా బంధనం, సద్గురుపాదపూజ

**9 గురు నుండి 11శని వరకు శ్రీ కృష్ణాష్టమివేడుకలు**

9 గురు ఉదయం 10 గం.లకు కలశస్థాపన,శ్రీ రాధాకృష్ణ అర్చన, భక్త సమారాధన. సాయంత్రం 6 గం॥ లకు శ్రీసద్గురుపాదపూజ

10 శుక్ర ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురుపాదపూజ, 11 గం.లకు శ్రీ రాధాకృష్ణ సామూహిక పూజలు, భక్త సమారాధన.

11 శని ఉదయం 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గం.లకుఉట్టి కొట్టుట

12 ఆది గురుదశమి సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

15 బుధ భారత స్వాతంత్ర దినము

16 గురు మాస శివరాత్రి

**సెప్టెంబరు**

5 బుధ టీచర్స్ డే (ఆచార్యదినోత్సవం) ఉదయం 10 గం॥లకు శ్రీ సద్గురు పాద పూజ

10 సోమ శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

14 శుక్ర మాస శివరాత్రి

19 బుధ శ్రీవినాయక చవితి, ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురు పాదపూజ. ఉ॥. 11 గం.లకు శ్రీవిఘ్నేశ్వరస్వామి ,సామూహిక పూజలు. భక్త సమారాధన.

29 శని పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ.

### పరసువేది

ఒక స్వాములవారికి పాదపూజ జరిగాక భక్తులంతా నమస్కరిస్తున్నారు. ఒక వేశ్య కూడా నమస్కరించబోయే సరికి స్వాములవారు కాళ్ళు వెనక్కి లాక్కున్నారు.

"పరసువేది దేవాలయంలో విగ్రహాన్ని ఎలా బంగారంగా మారుస్తుందో, కసాయివాడి చేతిలోని కత్తిని కూడా అలాగే బంగారంగా మారుస్తుంది. నిజమైన పరసువేదికి వివక్షత ఉండదు. దాని శక్తిపై దానికి సందేహమూ ఉండదు. మీరు పరసువేది అనుకున్నాను స్వామీ! మీకొక నమస్కారం! శెలవు!" అని వెళ్ళిపోయింది.

స్వాములవారూ, శిష్యులూ కూడా నిర్ఘాంతపోయారు!

# నేత్రార్పణ చేసిన మహా భక్తుడు

– సుషుమ్న ప్రసాద

నాగన్ అనే ఆటవిక వేటగాడు సువర్ణముఖి నదీ తీరాన ఉన్న ఉడుప్పూరు పల్లెవాసులకు నాయకుడుగా ఉండేవాడు. ఆ చుట్టుపక్కల ఉండే పల్లెవాసుల పట్ల యెంతో దయ, సానుభూతిని చూపిస్తూ వారిని వన్యమృగముల బారి నుండి రక్షిస్తూండేవాడు. చాలా కాలం వరకు సంతానం లేక నాగన్, అతని భార్య దత్త, వారి కుటుంబ దైవమైన శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని సంతాన ప్రాప్తికై ఆరాధించారు. ఆ స్వామి అనుగ్రహముతో వారికొక పుత్రుడు జన్మించాడు. ఆ దంపతులా బిడ్డకు 'తిన్నన్' అని నామకరణం చేసి, గారాబంగా పెంచుకొన్నారు. అతను తండ్రికి మించిన సమర్థుడై మంచి వేటగాడిగా ప్రసిద్ధి చెందాడు.

నాగన్ వయోవృద్ధుడు అవుతున్నందున తన కుమారుడు తిన్నని నాయకునిగా అభిషేకించాడు. ఒకరోజు తిన్నన్, అతని స్నేహితుడు నన్నన్ సరదాగా అడవిలో వేటకు వెళ్ళారు. వారు చాలా వేగంగా తప్పించుకొని పరుగిడే వన్య మృగమును వేటాడటం మొదలు పెట్టారు. నన్నన్ అలసిపోయి ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసుకుంటున్నాడు. కాని పట్టుదలతో తిన్నన్ ఒక్కడే వేటాడి, ఆ మృగాన్ని సంహరించటములో సఫలీకృతుడయ్యాడు. వారిద్దరూ వేటాడి, అలసిపోయి, బాగా ఆకలిగా ఉండంటం చేత, చంపిన ఆ మృగ మాంసాన్ని భక్షించారు. దప్పికగా ఉండటంతో వారివురూ స్వర్ణముఖినదికి నడుస్తూ వెళ్ళారు. అక్కడ నదీ జలం తాగి దప్పిక తీర్చుకొంటుండగా నది కావలి ఒడ్డున ఒక కొండను చూసి తన స్నేహితునితో యిలా అన్నాడు ' నన్నన్! ఆ కొండవంక చూడు ఎంత అందంగా ఉన్నదో! నాకు ఆ కొండ యెక్కి ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ ఆనందించాలని ఉన్నది' అన్నాడు.

అప్పుడు నన్నన్ సమాధానం చెబుతూ ' అవును. అది శ్రీకాళహస్తి యని పిలవబడే అందమైన కొండ. ఆ కొండ శిఖరంపై ఒక గుత్తి ఆకారంలో లింగమున్నది. ప్రజలు ఆ లింగమును కుడిపి దేవర్ (కుడిమి అంటే తమిళంలో గుత్తియని అర్థం) గా ఆరాధిస్తారు. తిన్నన్ "మనమిక కాలాన్ని వృధా చేయక ఆ పర్వతం వద్దకు వెళ్దాం" అన్నాడు. వారివురూ నదిని యీదుకుంటూ వెళ్ళి, అవతలి తీరాన ఉన్న కొండమీదకు ఎక్కారు. అక్కడ తిన్నన్ లింగాన్ని చూసి, ఆనంద పరవశుడయ్యాడు. పరమేశ్వరుడు తన్ను ఆశీర్వదిస్తున్నట్లు అనుభూతిని పొందాడు. ఆ లింగాన్ని ఆలింగనం చేసుకుని యిలా అన్నాడు ' ఓ ప్రభూ! ఈ కీకారణ్యములో రాత్రింబవళ్ళు వంటరిగా ఉన్నావు. నీవీ వన్యమృగాలను చూసి భయపడటం లేదా? చింతించవద్దు. ఇక మీదట నీ బాధ్యత

నేను వహించి, జాగ్రత్తగా చూసుకుంటాను' అన్నాడు. నన్నన్ యింటికి తిరిగివెళ్దాము రమ్మన్నాడు. తిన్నన్ మాత్రం తాను కుదిమిదేవర్‌కు కాపలా కాస్తాను అన్నాడు. నన్నన్ తన స్నేహితుని ప్రవర్తనకు కలత చెంది, ఆ విషయాన్ని నాగన్‌కు తెలియజేయటానికి వడివడిగా వెళ్ళాడు.

తిన్నన్ లింగం చుట్టూ జలము, బిల్వదళములు, లింగంపై కొన్ని పుష్పాలు వుండటం గమనించాడు. ' ఓహో! నీకు స్నానము, అలంకారమంటే యిష్టమా!' అని తనలో తాను అనుకొన్నాడు. వెంటనే నీరు, పుష్పములు, మాంసము తీసుకురావడానికి వెళ్ళాడు. కాని జలాన్ని తీసుకురావడానికి చేతిలో యే పాత్ర లేదు. అందుచేత స్వర్ణముఖి జలాన్ని తన పుక్కిట బిగించి. అక్కడ ఉన్న అడవి పూలను కోసి తన శిరోజాలలో పెట్టుకుని, మృగ మాంసాన్ని పెద్ద ఆకులో పెట్టుకొని లింగం వద్దకు వచ్చాడు.

లింగంపై ఉన్న బిల్వదళాలను, పుష్ప నిర్మాల్యమును తన పాదరక్షతో తొలగించి, ఆ లింగముపై తన పుక్కిట ఉన్న నీటిని ఉమ్మి, అభిషేకము చేసినట్లుగా భావించాడు. తరువాత తాను తెచ్చిన మాంసఖండము, తినటానికి యోగ్యంగా ఉన్నదో లేదోననితాను చవిచూసి, అందులోని ఎముకలను ఏరివేసి, స్వామికి నివేదనగా అర్పించాడు. స్వామికి ఏ విధమైన ఆపదా రాకూడదని, ఆ రాత్రంతా జాగరణ చేసి, యే ఆపదా రాలేదని ఆనందించాడు.మరునాడు ఉదయమే తిన్నన్ స్వచ్ఛమైన జలమును, పుష్పాలను, తేనెతో రంగరించిన ప్రత్యేక మాసంమును స్వామి కైంకర్యమునకై తీసుకురావటానికి బయలుదేరాడు. వెడుతూ కుదిమిదేవరతో ' స్వామీ! భయపడవద్దు' నేనొక అరగంటలో తిరిగి వస్తాను' అని చెప్పి కొండ క్రిందకు వేగంగా వెళ్ళాడు.

అంతలో నిత్యమూ లింగమునకు అభిషేకము, అలంకారము, నివేదన చేసే బ్రాహ్మణ పూజారి ' శివగోచర' అక్కడకు వచ్చి స్వామివారికి చేసిన అపచారాన్ని చూసి భయకంపితుడైనాడు. ' ఓ పరమేశ్వరా! ఏమిటి మీకీ అపచారము' అని విలపించి, ఆ అడవిపూలను, సింగము చుట్టూ ఉన్న మాంసపు ముక్కలను తీసివేశాడు. ఆ లింగానికి స్వచ్ఛమైన జలంతో ప్రక్షాళనం చేసి, ప్రత్యేక మంత్రాలను ఉచ్ఛరిస్తూ బిల్వదళములతో, మల్లెపూలతో అలంకరించాడు. తన యింటిలో ఎంతో శుచిగా, ఆచారంగా చేసిన పక్వాహారమును స్వామికి నివేదనచేసి, తిరిగి వెళ్ళాడు.

తిన్నన్ కుదిమదేవర్ వద్దకు వచ్చి, స్వామి నలంకరించిన నిర్మాల్యమును, తన పాదరక్షలతో తొలగించి,తన పుక్కిట నీటితో స్నానము చేయించి, తాను తెచ్చిన మాంసఖండములను నివేదన చేశాడు. శివగోచర, తిన్నన్ ఈ విధంగా ఒకరి తరువాత మరొకరు వారికి నచ్చిన రీతిలో ఆరాధన చేయటం దైనందిక చర్యగా మారింది.

– సశేషం

# గురు కృపాహి కేవలమ్

సేకరణ-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

భగవానుని అనుగ్రహం పొందటానికి అనేక మార్గాలు వేద శాస్త్ర పురాణాలు తెలుపుతున్నాయి. అన్నిటిలో భక్తి మార్గం సులభము, శ్రేష్టము అని కూడా తెలుపుతున్నాయి.

ఎన్ని విధములగానైనా భక్తిని ఆచరించవచ్చును. కాని అన్నిటిలోను మూలసూత్రం భగవంతునిపైన నిష్కలంకమైన ప్రేమ. "సా భక్తి ప్రేమరూపా" 'నారద భక్తి సూత్రాలు' అనే గ్రంథంలో చెప్పబడింది. అంటే భగవంతునిపై పరమమైన ప్రేమ కలిగి ఉండటం.

తుమ్మలపల్లి మంగరాజుగారు శ్రీ బాబుని ప్రధమంగా దర్శించినప్పుడు మంగరాజుగారు నోరైనా మెదపకముందే శ్రీమంగరాజుగారి గురించి అంతా చెప్పేశారు. శ్రీబాబు మాటలలోని ఆత్మీయత, ప్రేమ మంగరాజుగారిని అమితంగా ఆకట్టుకున్నాయి. ఆ నాటి నుండి దసరా పూజలకు, యితర పెద్ద పండుగలకు మంగరాజుగారు సకుటుంబంగా వెళ్ళి శ్రీబాబు సన్నిధిలో ఆ యా రోజులను సద్వినియోగం చేసుకునే వారు.

శ్రీబాబు మంగరాజుగారితో "మీ కుటుంబాన్ని, ఆస్తిని అంతా భగవంతుడే చూస్తాడు. మీరు దిగులుపడవద్దు. హాయిగా భగవచ్చింతనలో సమయాన్ని సద్వినియోగం చేసుకోండి" అనేవారు.

మంగరాజుగారికి యింతటి సంపదను ప్రసాదించిన తన గురుదేవులను వెండితో తులాభారం చేయాలని అనిపించింది. శ్రీబాబు "భలే షావుకారువయ్యా! ఒక ప్రక్క నీ సంపదంతా నేనిచ్చేందే అంటున్నావు. మళ్ళీ నన్నే తూకం వేస్తానంటున్నావు. అంటే నే యిచ్చింది తిరిగి నాకే యిస్తావన్నమాట. అదిసరేగాని, అసలు నా బరువెంతో నీకు తెలుసా?" అని అడిగారు.

మంగరాజుగారు "ఏమిటి బాబూ! మొన్న బెజవాడ ప్లాట్‌ఫారంమీద మనిమిద్దరం బరువులు చూసుకున్నాం కదా! మీ కంటె నేనే ఎక్కువ బరువు ఉన్నాను అని కూడా అన్నాను" అన్నారు.

శ్రీబాబు "అయితే యింకేం నా బరువు తెలుసుకున్నావన్న మాట. ఇంక నీ కోరిక తీర్చుకో" అన్నారు.

అది విరోధికృత నామ సంవత్సర ఆషాఢ శుద్ధ పూర్ణిమ అనగా జులై 8వ తేదీ బుధవారం 1971. ప్రసాద నిలయంలో (శ్రీబచ్చు పాండురంగ శ్రీశైలరావుగారింట్లో) మేడ మీద మూడవ అంతస్థులో గురుపూజకి అంతా సిద్ధం చేశారు. శ్రీబాబు గురుపూజకి వేంచేశారు. పూజా కార్యక్రమం మొదలై తెల్లవారుజామున 4-30ని॥ ముగిసింది. కొద్దిగా వర్షం పడింది. శ్రీబాబు లోపలికి వెళ్ళబోతూ ఒక్కక్షణం ఆగి, ప్రక్కనే ఉన్న గురువుగారి (శ్రీలలితానంద సరస్వతి) వైపు చూశారు. ఆవిడ అక్కడ ఉన్నవారందరితో "మీ కందరికీ సంతోషకరమైన వార్త! రేపు ప్రొద్దున గురుపూజ ఉంది. ఇంకొక అద్భుతాన్ని మీరు చూడబోతున్నారు" అని "అంతేనా బాబూ!" అన్నారు. "అంతే! అంతే!" అంటూ శ్రీబాబు తమ గదిలోకి వెళ్ళిపోయారు.

మరునాడు శ్రీబాబు కోసం ఏర్పాటు చేసిన సింహాసనం ప్రక్కన ఒక పెద్ద కాటా (త్రాసు) ఏర్పరచబడింది. గురుపూజకి వస్తూనే శ్రీబాబు సరాసరి వెళ్ళి త్రాసులో కుడిప్రక్క పళ్ళెంలో కూర్చున్నారు. తులాభార మహోత్సవం మొదలైంది. గురువుగారు "ఇప్పుడు మంగరాజుగారు శ్రీబాబును వెండితో తూచి ఆ వెండిని శ్రీగురుదేవులకు సమర్పించ బోతున్నారు" అన్నారు. ఒక్కసారి భక్తులందరి మనస్సుల్లో ద్వాపర యుగంలోని తులాభార ఘట్టం తళుక్కున మెరిసింది.

మంగరాజుగారు శ్రీబాబుకి నమస్కరించి వెండి పళ్ళాలూ, వెండిబిందెలూ, యితర వెండి వస్తువులు ఎడమవైపు త్రాసులో వేయించారు. చాలలేదు. ఇంకా ఎన్నెన్నో తెచ్చి వేస్తూనే ఉన్నారు. పళ్ళెంలో అణుమాత్రమైనా చలనం లేదు. శ్రీబాబు ముఖంలో చిరునవ్వు చంద్రికలు! భక్తుల హృదయంలో కుతూహలపు అలలు! మంగరాజుగారి మనస్సులో కలవరపాటు కెరటాలు!

-సశేషం



23 శ్లో॥ సార్థం సమృద్ధైరమృతాయ మానైరాధాయ మానైర్మురళీ నినాదైః।
మూర్ధాభిషిక్తం మధురాకృతీనాం బాలం కదా నామవిలోకయిష్యే॥

తలుపు చాటున నిలబడి అలా ఎంతసేపటి నుంచీ చూస్తున్నానో! ఎంతసేపు చూసినా తనివి తీరటం లేదు. మనస్సు పొంగి యెదుట పడితే యింకేమైనా ఉందా! యశోద మనస్సులో వెయ్యి అనుమానాలు, లక్ష సందేహాలు వచ్చి బిడ్డ అంగాంగాలకీ అన్ని రకాల దిష్టులూ తీస్తుంది. కనుక కిమ్మనకుండా కళ్ళప్పగించి చూస్తూ యిక్కడే నించున్నాను. అడవులలో పగలంతా తిరిగి తిరిగి అలసిపోయి వచ్చిన బిడ్డకి ఒళ్ళంతా రుద్ది రుద్ది నీళ్ళుపోసి, సుఖంగా ఉండే సున్నితమైన బట్టలు తొడిగింది. తేలికగా ఉండే నగలు, పువ్వులు పెట్టింది.నుదుట కస్తూరి బొట్టు పెట్టి, నీలి మబ్బురంగు ఒంటి నిండా చల్లని గంధం పూసింది. కడుపు నిండా కమ్మని పెరుగన్నం తినిపించింది. అంతకీ తృప్తిలేక పసిడి గిన్నెలో పాలుపోసి, తాగించింది. బంగారు తూగుటుయ్యాలలో హంసపక్షి ఈకెలకన్నా మెత్తని పట్టుపరుపు పరచి, బిడ్డ ఒళ్ళు వత్తుకుని ఎక్కడ కందిపోతుందో అని, ఆపైన పారిజాతం పూల రెక్కలు, జాజిపూల రేకులు పక్కనిండా పోసి పడుకోబెట్టి జోలపాడింది. ఇదంతా చూడటానికి నాకు రెండు కళ్ళు చాలటం లేదు. సంపెంగ నూనెలు పోసిన రత్నదీపాలలో వత్తులను తగ్గించి పెట్టింది,ఎక్కువ కాంతి బిడ్డ కంటికి నిద్రను దూరం చేస్తుందని. బిడ్డ నిద్రపోయాడని మరొకసారి వెనక్కి తిరిగి చూసి నిర్ధారణ చేసుకుని లోపలికి నట్టింట్లోకి వెళ్ళింది.

ఆమె అలాగ వెళ్ళిన అరక్షణంలోనే చివ్వున లేచాడు నందగోపాలుడు. చప్పుడు కాకుండా మెల్లిమెల్లిగా అడుగులు వేసుకుంటూ నేనున్న తలుపు దగ్గరకి వచ్చాడు. 'పదపోదాం' అంటూ నా చెయ్యి అందుకున్నాడు. ఆ స్పర్శకి నా ఒళ్ళంతా విద్యుత్తుని తాకినట్లు ఝల్లుమన్నది. 'మరి అమ్మ చూస్తే?' అన్నాను నేను. 'అదిగో చూడు!' అన్నాడు. ఉయ్యాలలో పాపడు నిద్రపోతూనే ఉన్నాడు. మరి ఇలాగ నా దగ్గిరకి వచ్చిన వాడు? 'అదీ నేనే, ఇదీ నేనే. రెండూ సత్యమే' అన్నాడు. విస్తుపోయాను. యజమాని ఆజ్ఞ పాలించే సేవకునిలాగ నందకిశోరుని అనుసరించి అడుగులు వేస్తున్నాను.

నెత్తి మీద వెన్నెల కురుస్తోంది. బాటన నడుస్తున్నవాడు చటుక్కున ఒక యింటి ముందు ఆగాడు. సన్నని దీపం వెలుతురులో ఆ యింట్లోని ఒక గోపిక కనిపించింది. ఒడిలో పాపడు పాలుతాగుతూనే మారం చేస్తున్నాడు. ఎంత సముదాయించినా ఊరుకోవటం లేదు. గోపికల కళ్ళల్లో నీళ్ళు దీపకాంతిలో వెండి దారాలలాగ మెరుస్తూ

చెంపల మీద నుంచి కిందికి జారుతున్నాయి. ఆమె భర్త కాబోలు వచ్చి చూసి వెడుతున్నాడు. అంతదాకా పట్టుకునే ఉన్న నా చేతిని వదలి చప్పున లోపలికి వెళ్ళాడు కృష్ణుడు.

ఆమె కళ్ళు తుడుస్తూ 'నేనున్నానుగా!' అంటున్నాడు. 'వచ్చావా స్వామీ! బిడ్డ పడుకోలేదు. పెనిమిటికి అనుమానం కలిగినట్లుంది. క్షణక్షణం వచ్చి నన్ను గమనించి వెడుతున్నాడు. ముందు చావడిలో పడుకున్న ముసలి అత్తమామలు యింకా అది చెయ్యలేదు, యిది చెయ్యలేదు అని సణుగుతూ, గొణుగుతూనే ఉన్నారు. ఈ బంధాల నుంచి నాకు విముక్తి ఎప్పటికి?' అంటోందా గోపిక.

'ఇప్పుడే నువ్వు ఆ యమునా తీరానికి వెళ్ళిపో. తక్కినవన్నీ నేను చూసుకుంటాను' అన్నాడు చిరునవ్వుతో గోపాలుడు. నా ముందునుంచే ఆ గోపిక చక చకా నడుస్తూ వెళ్ళిపోయింది. అప్పడిదాకా జరిగింది నాకు కనబడుతూనే, వినబడుతూనే ఉంది. అది లీలా కిశోరుని చిత్రమేమో అనుకుంటుంటే యింకా విచిత్రం కనిపించింది. అప్పటిదాకా యిబ్బంది పడిన యిల్లాలు యిప్పుడు చక్కగా తన పనులన్నీ నెరవేరుస్తూ కనిపించింది. ఆనందంగా ఉంది బాధ లేదు. నాకు బోధపడలేదు. విషయమేమిటో! నా పక్కకి వచ్చి నిలబడిన యశోదా తనయుడు 'సరిగా చూడు. ఆ వెళ్ళిన యువతి సత్యం. లోపల ఉన్నది మాయ. అర్థమైందా?' అన్నాడు సన్నగా నవ్వుతూ.

నడక వేగం పెంచి సాగుతున్న కృష్ణుడు మళ్ళీ మరో యింటి ప్రక్కగా నిలబడ్డాడు. ఆ వేపునున్న తడికెల గదిలోంచి నీళ్ళ చప్పుడు వినిపిస్తోంది. కిందికి వంగి మట్టిగడ్డ ఒకటి తీసి సూటిగా గురిచూసి ఆ తడికెల గదిలో పడేటట్లు విసిరాడు. 'కృష్ణా!' అనే శబ్దం వినిపించింది. ఆ వెనకే స్నానం చేస్తున్న ఒక గోపిక బయటకి వచ్చేసింది. 'ఎంత మధురంగా ఉంది కన్నా! అమృతమయమైన నీ చేతితో మట్టిగడ్డకి ప్రాణం పోసి విసిరావు చూడు! అది వచ్చి నన్ను తాకి, 'కృష్ణుడు వచ్చాడే రమ్మనమంటున్నాడు' అనే కబురు చెప్పింది. ఆ శుభవార్త అందుకోగానే ఉన్నపళాన వచ్చేశానయ్యా నీ కోసం' అని. అంటున్న ఆమె మాటలు వింటూ ఆవేపు చూసి చప్పున కళ్ళు మూసుకున్నాను. ఎందుకంటే ఆమె పూర్తిగా వివస్త్ర! 'చూడు గోపీ! నీకు ఆనందంలో ఒళ్ళు తెలియటంలేదు కాని యిక్కడ పరాయివాళ్ళున్నారనే ధ్యాస పూర్తిగా పోయింది. లోకం ఏమనుకుంటుందీ?' అన్నాడు మందలింపుగా. గోపాలుడు తన ఉత్తరీయాన్ని విసిరి 'ఇది కట్టుకుని యింక బయల్దేరు. మళ్ళీ యింట్లోకి కోక కట్టుకోవటానికి వెళ్ళావంటే అక్కడ బందీ అయిపోతావు పద పద!' అని వేగిర పెట్టాడు కృష్ణుడు.

-సశేషం

**విచిత్రం!**

# భైరవుని ఓంకారం!

ఆశ్రమం!

-జగం

ఆశ్రయించిన అందరిదీ ఆశ్రమం

"ఈ ఆశ్రమాన్ని ఆశ్రయించిన భక్తులే కాదు, సకల ప్రాణులు, చెట్లు, పుట్టలు, దుమ్ము, ధూళి, గాలి, నేల అన్నీ ముక్తిని పొందుతాయి. అందులో ఏ మాత్రం సందేహం లేదు," అని శ్రీబాబు చెప్పారు. ఎంతో పూర్వజన్మ పుణ్యఫలం ఉంటేనూ, సద్గురు సంకల్ప బలంతోనూ మాత్రమే ఎవరైనా గాని, ఏదైనాగాని ఆశ్రమానికి రావడం జరుగుతుంది.

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంలో ఒక మైనా ఉండేది. బాబూజీ ఎప్పుడు కనిపించినా అది 'బాబూజీ, బాబూజీ!' అని ముద్దుగా పిలిచేది. అలా పిలవాలని దానికి ఎవ్వరూ నేర్పలేదు. మరి ఎలా నేర్చింది? జన్మ సంస్కారం! బాబూజీ కూడా ఎప్పుడూ దాన్ని పలుకరించేవారు.

అలాగే ఒక త్రాచుపాము ఉండేది. రోజూ సాయంత్రంపూట పుట్టలో నుంచి బయటకు వచ్చేది. కాసేపు ఆశ్రమంలో అటూ, ఇటూ సంచారం చేసి, పుట్టలోకి వెళ్ళిపోయేది. "దాన్ని ఎవ్వరూ ఏమీ చేయకండి. అది ఆశ్రమ క్షేత్రపాలకుడు. పూర్వజన్మలో అది ఒక ముని" అని శ్రీబాబు చెప్పేవారు. అది ఎవరికీ ఎటువంటి హాని చెయ్యలేదు.

దసరా ఉత్సవాల సందర్భంగా 16-10-2010నాడు ఆశ్రమం రామాలయంలో ఉపన్యాసాలు ముగిసాయి. వచన ప్రార్థన 'సత్య సుందర .....' ప్రారంభించే ముందు " మూడుసార్లు ప్రణవాన్ని పూరించండి" అని శ్రీమాతాజీ అన్నారు. శ్రీమాతాజీ 'ఓం' అని ప్రారంభించే సమయానికి బయట ఉన్న ఒక భైరవుడు (కుక్క) చక్కనైన రాగంతో 'ఓంకార' నాదం చేసింది. శ్రీమాతాజీ దరహాసం చేసారు. అందరూ ఆశ్చర్యపోయారు! వెంటనే ఇంకా రెండు సార్లు కూడా 'ఓంకార' నాదం చేసింది.

అప్పుడు శ్రీమాతాజీ "భైరవుడు కూడా మూడుసార్లు ఓంకార నాదం చేశాడు. ఇంక చెయ్యడు" అన్నారు. ఆజ్ఞను శిరసావహిస్తున్నట్లుగా భైరవుడు తిరిగి ఓంకారం చెయ్యలేదు.

"జన్మ సంస్కారం" అని శ్రీమాతాజీ అన్నారు.

*

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

శ్రీసద్గురుదేవులు భక్తులను ప్రశ్నిస్తూ "మీరంతా ధ్యానం ఎందుకు చేస్తున్నారు? ఏదో పొందాలనేగా? పొందుతున్నారా? అలా పొందితే ధ్యానం నుంచి ఎందుకు విరమిస్తున్నారు?

కాళ్ళ నొప్పులచేతనో, ఏదైనా సంకల్పము కలిగి దానిని నెరవేర్చటానికో లేక ఇంకే కారణమైనా ఉండవచ్చు. ధ్యానం ద్వారా పొందవలసిన ఆనందాన్ని పొందితే ధ్యాన ప్రక్రియని ఎందుకు విరమిస్తారు?

ధ్యానంలో మనస్సు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు స్పందించి అటూ యిటూ తిరుగుతూ దిక్కు తెలియక లక్ష్యం లేక ప్రయాసతో ఆయాసపడినంత సేపూ నీకు శాంతి ఎలా చేకూరుతుందయ్యా?

మనస్సు తన స్వస్థానం చేరినప్పుడే ఆనందము, శాంతి. అయితే స్వస్థానమేదో తెలియాలి కదా. అంతేకాదు స్వస్థానము చేరే మార్గము తెలియాలి. శాస్త్రజ్ఞానము అందుబాటులోనే ఉంది. శాస్త్రంలో అన్ని వివరంగానే చెప్పబడ్డాయి. సముద్రం నిండా నీరు ఉంది. కాని మనకి కావలసిన నీరు, సముద్రపు నీరే మేఘరూపం దాల్చి వర్షిస్తేనే మనకి అందుబాటులో ఉండేది. అలాగే మనస్సు స్వస్థానమేదో దానిని ఎలా చేరాలో తెలిపే మార్గదర్శకుడే సద్గురుమూర్తి. నడవగలిగి కాళ్ళు ఉన్నా, మార్గాన్ని అన్వేషించగల జ్ఞానచక్షువులు లేని అంధుడు గమ్యాన్ని చేరలేడు. వాడికి తోడుగా కన్నులున్న కుంటివాడు తోడుగా ఉంటే గమ్యాన్ని చేరగలుగుతాడు సుమా!

శాస్త్రం విషయు జ్ఞానం యిస్తుంది. కాని అనుభవ జ్ఞానం అందించగలవాడు సద్గురుమూర్తి మాత్రమే. నిర్ణీతకాలంలో ధ్యానం చేయటం ద్వారా మనస్సుని నియంత్రించి సక్రమమైన మార్గానికి తెచ్చుకోవటానికి తోడ్పడుతుంది. ధ్యానం ద్వారా నీ దేహాన్ని, యింద్రియాలను అధిగమిస్తే అది మనస్సు స్థిరపడింది అనటానికి సంకేతం. సాధనలో ముందుగా దానిని సాధించగలిగితే తప్పక విజయుడవు అవుతావు" అన్నారు శ్రీబాబు.

***

(గత సంచిక తరువాయి)

# శివానందలహరి

-బులుసు మల్లిక్ USA

శ్లో॥ మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్ర ఫణితౌ
కరశ్చాభ్యర్చాయాం శ్రుతిరపి కథాకర్ణనవిధౌ
తవ ధ్యానే బుద్ధిర్నయ యుగళం మూర్తి విభవే
పరగ్రంథాన్ కైర్వా పరమశివ జానే పరమతః

ఈ శ్లోకంలో శంకరులు ముక్తిని ఎలా కైవశం చేసుకోవచ్చో మనకి తెలియ బరుస్తున్నారు. ప్రధానంగా రెండిటి అవసరముఉంది. ఒకటి మనము సరియైన మార్గం ఎంచుకోవాలి. రెండవది మనమెంచుకున్న మార్గాన్ని పట్టువదలకుండా జాగ్రత్తపడాలి. దీనికే ఒక ఉదాహరణ చూద్దాం. కాకినాడ నగరం నిర్మాణం అద్భుతంగా ఉంటుంది. ఇక్కడ ఒక దేవాలయం వీధి ఉంది. ఎన్నో దేవాలయాలు ఈ రోడ్డులోనే ఉన్నాయి. మీరు మనస్సు ప్రశాంతంగా ఉండాలని దైవ దర్శనానికి బయలుదేరారే అనుకుందాం. చెయ్యాల్సిందల్లా ఆ దేవాలయం వీధికి వెళ్ళగలిగితే చాలు. ఇకపోతే మీ ఆశయానికి భంగం కలగకూదంటే ఎట్టి పరిస్థితులలోనూ యీ రోడ్డు విడవకుండా మీ నడక సాగేట్లు చూసుకుంటే యిక చింతలేదు.

ఇక్కడ శంకరులు కూడా యిదే విషయాన్ని చెబుతున్నారు. భక్తిమార్గం నుంచి బయట పడకుండా జాగ్రత్త పడితే చాలుకదా అంటున్నారు. ఉపదేశసారంలో ఇదే విషయాన్ని రమణులు కూడా *ఆజ్యధారయా స్రోతసాసమం* అని ధృవీకరించారు. కరిగిన నేతిధారని చూడండి. ఒక నేతి బిందువు నుండి వేరే నేతిబిందువుని మనం వేరు చేయలేము. అది తీగలాగ ప్రవహిస్తుంది. అలాగే నిలకడ కలిగిన నీటిధార కూడా ప్రశాంతంగా ప్రవహిస్తుంది. అదే రీతిలో భక్తికూడా సాంద్రమైనది కావాలి. అవిరళమైనది కావాలి. అందుచేత శంకరులు భక్తిని వినూత్నమైన అవధాన ప్రక్రియగా ఆవిష్కరిస్తున్నారిక్కడ. అలా ఎందుకంటున్నానంటే బ్రహ్మశ్రీ కరికిపాటి నరసింహారావు గారి అష్టావధానాన్ని ఒకటి రెండుమార్లు ప్రత్యక్షంగా తిలకించే భాగ్యం నాకు కలిగింది. పృచ్ఛకులు ఆయనపైకి ఎడతెరిపి లేకుండా ప్రశ్నల బాణాలని సంధించినప్పటికి ఆయన తడబడకుండా ఎంతో ఏకాగ్రతతో చమత్కారంగా ప్రతిప్రశ్నకూ చిరునవ్వుతో బదులిస్తూ ప్రేక్షకులని అలరించారు. ఆ పృచ్ఛకులడిగే ప్రశ్నలని తప్ప వేరేవేమీ ఆలోచించకుండా జాగ్రత్తపడటమే దీనికి కారణమని మనం గ్రహించవచ్చు. అదేవిధంగా మన భక్తికి అంతరాయం కలిగేది దేనివల్ల? దీనికే శంకరులు మూడుకారణాలని బయటకు తెస్తున్నారు. ఒకటి మనస్సు, రెండవది బుద్ధి. మూడవది యింద్రియ సంపుటి. మనం కూడా పరమాత్మపై నిలిపిన మనస్సు మళ్ళకుండా ఉండాలంటే ఇంద్రియాలన్నిటినీ

అవధానం మాదిరిగా ఈశ్వరచింతనలో నిలపాలన్నదే శంకరుల సలహా.

ముందుగా మనసును ఎలా మచ్చిక చేసుకోవాలనే విషయంపై కేంద్రీకరించారు శంకరులు. *మనస్తే పాదాబ్జే నివసతు* – అనటంలో ఎల్లవేళలా మనస్సుని పరమేశ్వరుని పాదపద్మములలో లగ్నం చేసుకోవాలన్నదే శంకరుల సూచన. ఎందుచేతనంటే మనస్సు ఎల్లవేళలా బుద్ధికి కోరికల రూపంలో దరఖాస్తు చేస్తూంటుంది. కాని దీనినే మలచుకుంటే ముక్తికి కరతలామలకం కాగలదని శంకరుల తీర్మానం. అలాగే శంకరులు *తవధ్యానే బుద్ధిః* – అంటున్నారు. అలా పరమశివుని ధ్యానంలో బుద్ధి నిమగ్నం కావాలన్నదే శంకరుల నిర్ధారణ. ఎందుచేతనంటే మనం చేసే కర్మలన్నీ బుద్ధియొక్క నిర్ణయాత్మక శక్తివల్లనే సాధ్యమవుతాయి. కర్మఫలాల భారం నుండి తప్పించుకోవాలంటే బుద్ధిని శివధ్యానంలో చేసుకోవాలి. అలాంటప్పుడు మనం చేసే కర్మలు సహజంగానే ధర్మబద్ధమవుతాయి.

ఇక ఇంద్రియాల విషయానికొస్తే *వచః స్తోత్రఫణితౌ* – అనడంలో వాక్కులని భగవంతునికి అర్పించాలనీ, *కరశ్చాభ్యర్చాయం* – అనటంలో ఈశ్వరార్చనకే చేతలని అకింతం చేయాలనీ, *శ్రుతిరపి కథాకర్ణనవిధౌ* – అనడంలో ఎల్లవేళల శివుని కథలని వినడంలో చెవులని నిలిపి ఉంచాలనీ, మరియు *నయన యుగళం మూర్తి విభవే* – అనడంలో శివరూప సౌందర్యాన్ని తిలకించడంలో దృష్టిని సారించాలని శంకరుల సలహా. ఇది శంకరులు భాగవతులని ప్రధానంగా చేసుకుని రచించిన శ్లోకం. బాగవతంలో కూడా పోతన యిలాంటి పద్యాలని ఎన్నో రచించారు. *హరిన్ భావించుచుం బాడుచున్ జపముల్ సేయుచు, వీనులన్ వినుచు నశ్రాంతంబు గీర్తింపుచున్ దపసుల్ సాధులు ధనుయౌదురు కదా* – అంటారు ప్రధమ స్కందంలో. అలాగే కమలాక్షునర్చించు కరములు కరములు శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ అంటారు సప్తమస్కంధంలో. ఇంకా *హరిభజియించు హస్తములు హస్తములు అచ్యుతు గోరి మ్రొక్కు తచ్ఛిరము శిరంబు* అంటారు దశమ స్కంధంలో. ఇలా పదేపదే భాగవతుల నుద్దేశించి ఒకే తత్త్వాన్ని నొక్కివక్కాణించారు పోతన. దీని వెనుక గూఢార్ధమేమిటంటే విశ్రాంతి లేకుండా ఇంద్రియ సద్వినియోగం చేయటమే ముక్తికి సులభోపాయము.

దీనికే చివరిగా *పరగ్రంధాన్కైర్వా పరమశివ జానే పరమతః* – అని శంకరులు ధృవీకరించారు. అంటే మనస్సుని, బుద్ధిని, అలాగే అన్ని ఇంద్రియాలనూ భగవదర్పణం చేసుకున్నాక శివభక్తి మార్గాన్ని వీడి మరో మార్గానికి పోయేటందుకు తావేలేదుకదా అంటున్నారు. ఇలా పరిపూర్ణమైన రీతిలో ఆత్మనివేదన చేసుకొంటే మనం శివానందం పొందడమన్నది తథ్యమన్నదే శంకరుల బాష్యం. మనం కూడా భక్తిలో ఏకాగ్రతను పొందేందుకు శంకరుల సలహాని పాటిద్దాం.. జీవితంలో సఫలీకృతుల మవుదాం!

## మౌన ధ్యాన సప్తాహ శిబిరం

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

గురుదేవులను గుర్తించటం ఎలా? ఆయన సర్వవ్యాపకుడు, చైతన్యమూర్తి. మూడు కాలాల్లో ప్రకాశిస్తారు అని అవగాహన చేసుకుంటే మనస్సు మనలో ప్రకాశించేది ఆ వస్తువే అని మనస్సుకు తెలుస్తుంది. అంతేకాదు మనస్సు మనలోని దోషాలను కూడా తెలుపుతుంది. అజ్ఞానంతో గురుదేవులను మానవమాత్రులుగా భావిస్తున్నాము. ఆయన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. వటపత్రసాయి. మనలోని అజ్ఞానాన్ని హరింపజేసి, బ్రహ్మానంద వారధిలో ముంచితేల్చే మహనీయుడు. మనలో ఆవేదన వుంటే ఆ ఆనందం మనకు లభ్యమవుతుంది. మనకు దైవమునందు నిష్ఠ, విశ్వాసము పూర్తిగా ఉంటే ఆయన కృప తప్పక లభిస్తుంది.

ఒక సాధువు ఒక యింటిముందు నిలబడి "అయ్యా! దాహంగా ఉంది. నీరు యిప్పించండి" అంటాడు. ఆ యింటి యజమాని నేను దైవపూజా కార్యక్రమంలో వున్నాను ఆగు!" అని అన్నిదేవుళ్ళ అష్టోత్తరాలు చదువుతుంటాడు. సాధువు నీటికోసం అర్థించిన అప్పుడల్లా అటునించి సమాధానం రాకపోయేటప్పటికి ఒక గుంట త్రవ్వుతుంటాడు. చివరికి యింటి యజమాని బయటకి వచ్చి, యిల్లంతా పాడుచేశావు. ఇన్ని గుంటలు బదులు ఒక్క గుంట త్రవ్వితే నీకు నీరు దొరికి ఉండేది కదా!" అన్నాడు. సాధువు "మీరు కూడా యిందరు దేవుళ్ళని పూజించేబదులు, ఒక్క దేవుడినే ఆవేదనతో కొలిస్తే మీకు ఆ దేవుడి కృప లభించి ఉండేది కదా" అన్నాడు.

మనకు జీవితంలో ఎదురయ్యే సమస్యలవల్ల సుఖ శాంతులు దూరం అవుతాయి. ధైర్యంగా వాటిని ఎదుర్కొని గురులక్ష్యార్థంపై నిష్ఠను నిలిపి ముందుకు సాగిపోవాలి. జరిగిన దాన్ని గురించి, జరగబోయే దాన్ని గురించి బాధపడకుండా "ఈ క్షణమే ఉంది. మరుక్షణం లేదను"కొని వర్తమానంలో మనస్సుని లక్ష్యార్థంపై నిలిపి వుంచటమే ధ్యానం. సోZహం అనే అజపగాయత్రిని చాలమంది రహస్యంగా వుంచుతారు, శ్రీబాబు బహిరంగంగా దానిగురించి చెబుతూ "ఇది సూచన మంత్రం. స్థిరాసనంలో కూర్చుని ఎంతసేపు ధ్యానిస్తే, అంతకాలం మన నిత్యకాలంలో జమవుతుంది" అన్నారు. ధ్యానంలో మనం చేసే కర్మలకు సంబంధించిన విషయాలు వచ్చి నిలుస్తాయి. భగవంతుడి మీద భారంవేసి కర్మచేస్తే వాటి ఫలితం నీకు అంటదు. మన యోగక్షేమాలు ఆయనే చూసుకుంటాడు. 'ఇది నాది, అది నాది' అంటే మాయలో పడ్డట్లేకదా. కర్మలు నివృత్తి మార్గంలోకి పోవాలి. ఎందుకంటే ప్రవృత్తి మార్గంలో చేసే పనులు జన్మకు కారణం అవుతాయి. నీకు భగవద్దర్శనం కావాలంటే నీ మనస్సు చంటిపిల్లవాడి మనస్సులా అవాలి. భోగభాగ్యాలు అనుభవించు. కాని ఎంతవరకు వుండాలో అంతవరకే. ఇంద్రియాలు సత్వగుణ ప్రధానంగా పెట్టుకోవాలి. భగవంతుడు

నిన్ను వెన్నంటియే వున్నాడు. నిన్నెప్పుడూ విడిచిపెట్టడు. వాడుంటేనే నువ్వు ఉన్నావు. లేకపోతే ఉండేది ప్రేతే. భగవంతుడు నీ కన్నుకు కన్నై, చెవికి చెవియై, జిహ్వాకు రుచి, మాట్లాడే శక్తి అయి, ముక్కుకు ఆఘ్రాణశక్తియై, త్వక్‌కు స్పర్శశక్తియై ఉన్నాడు. ప్రభూ! అనగానే మన మనస్సు ఆయన పాదాలపై నిలవాలి. నువ్వు వేసే ప్రతి అడుగు పరమేశ్వరునివైపు వెయ్యి. ఆయన తప్పక నిన్ను అనుగ్రహిస్తాడు. ఆయన నీ హృదయ మందిరంలోనే విరాజమానమై ఉన్నాడు. 'నేను మీ హృదయబాబును' అన్నారు బాబు. నువ్వు వెలుగులోనే ఉన్నావు. తలుపులు తీస్తే వెలుగు ప్రవేశిస్తుంది. జీవుడు సదాశివుడు. నీలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకుని మనస్సు నిర్విషయం చేసుకో. సోऽహం అనే ఎరుకలో వుండు. నీలో చైతన్యం ఉన్నంతవరకు ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఉంటాయి. హాయిగా శ్వాసతోపాటు ధ్యానం చేయి. అదే అజపగాయత్రి. అదే నిరంతర ధ్యానం.

మనస్సు ఎక్కడ పుడుతుందో గుర్తిస్తే మనస్సు నిర్వికల్ప సమాధి స్థితిని పొందుతుంది. మనం ఏడురోజులుగా చేస్తున్న ధ్యానయజ్ఞానికి ముగింపు. కాని ధ్యానానికి ముగింపు లేదు. నిరంతర ధ్యానం అలవాటు చేసుకోవాలి.

ఒక గురువు వద్దకు వెళ్ళి ఒకడు ఉపదేశం యిమ్మని అడిగాడు. "పొలంలో పండిన ధాన్యాన్ని బియ్యంగా మారుస్తూ ఉండు" అని ఆదేశించారు. అతడు ఆ సేవలో పూర్తిగా నిమగ్నమైపోయాడు. కొన్నేళ్ళు గడిచాయి. గురువుగారు పెద్దవారైపోయారు. తన తరువాత ఎవరిని అధికారిగా చేయాలి అనే దానిని నిర్ణయించటానికి శిష్యులందరిని పిలిచి, అందరికీ ఒక తెల్లకాగితం యిచ్చి "ఇందులో మీరు పొందిన అనుభవాన్ని వ్రాసి యివ్వండి" అన్నారు. ఎవరికి వారు తాము అధికారులం కావాలని శాస్త్రాలన్నీ తిరగేసి వాటిని కాగితాలలో నింపి గురువుగారికి యిచ్చారు. ఈ శిష్యుణ్ణి కూడా వ్రాసి యిమన్నారు. నాకు రాయటానికి ఏమి లేదు అని తెల్లకాగితం యిచ్చేశాడు. పూర్ణబోధలో ఉన్నవాడికి వ్రాసేందుకు ఏముంటుంది? గురువుగారు అందరు వ్రాసినవీ పరీక్షించి "కొన్ని సంవత్సరాలుగా నా ఆదేశాన్ని పాటించి ధాన్యాన్ని బియ్యంగా చేస్తున్న యీ శిష్యుడే నా ఉత్తరాధికారి" అన్నారు. గురోరాజ్ఞా ప్రకుర్వీత. గురువు ఆదేశించింది చేయాలి. ధ్యానం అక్కడే ఉంది. 'నువ్వు ఏమిటి తెలుసుకున్నావు?' ఆ శిష్యుణ్ణి ప్రశ్నించారు గురువుగారు. అతడు "నాకు పూర్ణమైన సేవయిచ్చారు. నామనస్సు అందులో లయమైపోయింది వడ్లగింజలో బియ్యపు గింజ అనే తత్త్వం అనుభవంలోకి వచ్చింది" అన్నాడు.

మీరందరూ ధ్యాన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ మీరు విన్న విషయాన్ని మీరు పొందిన అనుభూతిని మాటిమాటికి మననం చేసుకుంటూ సర్వకాల సర్వావస్థల యందు సత్యవస్తువుపై ధ్యాస నిలపండి. అటువంటి దివ్యానుభూతి సద్గురుదేవులు సాధకులందరికీ ప్రసాదించెదరు గాక!! సుఖీభవ!! సుఖీభవ!!

సమాప్తమ్

# తీరిన కోరిక

-సుశీలా ప్రసాద

"తళతళలాడే నీ కంటి చూపుల కాంతులతో పులకించి తిలక వృక్షమూ, నీ ఎర్రని పెదవులపై మెరిసే మృదుహాసం చూసి సంపెంగ అకాలమైనా పుష్పించాయి తల్లీ! మరి ఈ అశోక వృక్షం కడా నీ పాద తాడన మరియాద పొంది కుసుమించాలని ఎదురు చూస్తున్నది. ఆ పని కూడా కానీవమ్మా" అంటున్న జయ విజయుల ప్రోద్బలంతో దోహద ప్రక్రియతో ప్రమదావనంలోని తరువులను పుష్ప భరితాలను చేస్తున్న శివసతి గిరిజ అశోక వృక్షం ముందు నిలిచింది. అప్పుడే పూసిన తడి పారాణితో ప్రకాశిస్తున్న కన్నుల విందుగా ఉన్న సుకుమారమైన పాదాలతో దానిని తన్నింది.

దాపునే ఉన్న స్ఫటిక శిలావేదికపైన సుఖాసీనుడై ఉన్న పశుపతి చెలికత్తెలతో విహరిస్తున్న ప్రియసతి వంక చూస్తూ మురిసిపోతున్నాడు. "అంత అందమైన పాదాలతో తన్నబడిన ఆ అశోకవృక్షం ఎంత భాగ్యశాలి!" అని అశోకవృక్షం వంక చూస్తూ అసూయపడుతూ అనుకున్నాడు. తనుకూడా ఆమె పాదతాడనం పొందగలిగితే ఎంత బాగుంటుంది అనిపించాదాయనకు ఆక్షణంలో.

వెంటనే అనుకున్నాడు తనలో అలాటి కోరిక కలగటమా? ఇది భావజుని ప్రభావమా? తను మూడో కన్ను తెరిచేసరికి భస్మమైనాడు కదా కాముడు! ఇంకవాడెక్కడ? ముక్కంటి ఇలాగ ఆలోచిస్తున్న ఆ సమయంలో..........

"అమ్మా! నీ పెనిమిటి తన కంటి మంటలతో నన్ను దగ్ధం చేసి అనంగుని చేశాడు. నేనిప్పుడు నిన్నాశ్రయించి వేడుకుంటున్నాను. నాకొక రూపాన్ని ప్రసాదించు తల్లీ!" అని తన పాదాల ముందు మ్రొక్కుకుంటున్న మదనుని వంక ఆపేక్షగా అనురాగంతోచూపింది పార్వతీదేవి. ఆమె సుందర పాదారవిందాలకి వంగి నమస్కరిస్తున్న మన్మధునికి ఆ పాదాలకి ఉన్న అందెలలోని మువ్వలు వానినాకర్షించాయి.వెంటనే అతడు "అమ్మా! నీ కాలి అందెలలోని మువ్వలలో ఒక మువ్వనై ఒదిగి ఉంటానమ్మా! నాకీ వరం అనుగ్రహించు" అని ప్రార్థించగా అమ్మ కరుణించి వాని కోరిక తీర్చింది.

ఆ చల్లని వేళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏకాంతంలో ఆదిదంపతులు యిద్దరూ ఎంతో వేడుకగా ముచ్చటలాడుకుంటున్నారు. పార్వతి పలికే పరిహాస వాక్యాలకు పరమేశ్వరుడు నవ్వుతున్నాడు. అలాంటి సరసమైన సమయంలో శివుని తలపై నిలిచిన గంగకు భర్త అనురాగాన్ని పొందుతూ పరవశిస్తున్న గిరికుమారిని

చూసేసరికి అసూయ కలిగింది.

ఆమెలో పతిపైన ప్రేమ ఇనుమడించగా నాధుని చెవిదాకా వంగి గుసగుసగా "స్వామీ!" అని పిలిచింది. మందాకిని మధుర స్వరం విన్న హరునికి మేను పులకరించింది. తన్మయుడై పరిసరాలు మరచి కన్నులరమోడ్చి అనురాగ భరిత కంఠధ్వనితో "గంగా!" అన్నాడు. తనపతి నోట సవతి పేరు వింటూనే పార్వతి కోపంతో చివ్వున లేచింది. ముందు వెనుకా ఆలోచించకుండా మహాదేవుని నొసటిపైన కాలితో తన్నింది. ఆ తాపుకి ఆమె కాలి అందెలు కదిలి గలగలమని మ్రోగాయి!

చాలా కాలంగా ఫాలాగ్నితో తనను దగ్ధం చేసిన రుద్రునిపై కోపంగా ఉన్న మదనునికిప్పుడు అవకాశం వచ్చింది. తన ముందే తన శత్రువైన శివునికి అవమానం జరిగేసరికి యిన్నాళ్ళకి వాని వేదన తీరి సంతోషం కలిగింది. పార్వతి పాదతాడనం కోరిన శివుని కోరిక తీరిన వారి ప్రణయ కలహవేళలో అమ్మవారి కాలి అందెలలో మువ్వగా ఉన్న మదనుడు తాను జీవించే ఉన్నానంటున్న విధంగా కిలకిల నవ్వగా అది చిరుగంటల మ్రోతగా గలగలమని వాని విజయాన్ని చాటి చెప్పింది.

ఇది మదనహాసంలో పూర్ణమైన హరవిలాసం!తో

(శ్రీ శంకరుల 'సౌందర్యలహరి' ఆధారంగా)

## అందరికీ తెలిసిన మాటే!

ఒక ద్వైత పండితుడు జీవుడు వేరు- ఈశ్వరుడు వేరు అని వాదించి ప్రత్యర్థి పండితులను చిత్తు చేస్తూ దేశ సంచారం చేస్తూ ఉన్నాడు. ఒక గ్రామంలో తన ఉపన్యాసం దంచుతున్నాడు. ఆ దారిలోనే ఒక చాకలివాడు వెడుతున్నాడు. సభలో ఉన్న ఒక అద్వైత పండితుడికి ఒక ఆలోచన వచ్చింది. వెంటనే ఆ చాకలి వాడిని పిలిచి 'నువ్వు పరబ్రహ్మావు, భగవంతుడివి, దేవుడివి' అన్నాడు.

ఆ చాకలి అదిరిపడి లెంపలు వేసుకుంటూ ' ఎంతమాట! పరమపాపిని నేనెక్కడ? ఆ భగవంతుడెక్కడ? అపచారం అపచారం' అన్నాడు.

అప్పుడు ఆ అద్వైతి, ద్వైతపండితునితో "తాము చెప్పే 'దేవుడువేరు, జీవుడు వేర'నే మాట మా చాకలివాడికి కూడా తెలుసు. ఆ మాట చెప్పటానికి వాడే చాలును. తాము ప్రయాసపడి యింత దూరం రావడం దేనికి? కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు, తాము శాస్త్రాలన్నీ కాచివడపోసి తెలుసుకున్నదింతేనా?" అన్నాడు.

ఆ ద్వైతపండితుడు మౌనం వహించాడు.

# విషయ వాసన

- శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి

ఒక పట్టణంలో ఒక పెద్ద వర్తకుడు ఉన్నాడు. అతని అంగడిలో అన్నిరకముల పప్పు దినుసులు దొరుకుతాయి. వస్తువులను చాల పరిశుభ్రముగ నుంచుటలో అతనికి అతనే సాటి. అందుచేత ఆ పట్టణ వాసులలో పలువురు వారి వారికి ఏదైన పప్పుపదార్థాలు కావలసివచ్చినప్పుడు అతని అంగడికే వచ్చేవారు. గొప్ప నిజాయితీ కలవాడని, మంచి వస్తువులనే విక్రయించువాడని ఆ పట్టణములో అతనికి ఖ్యాతి లభించింది. ఏ క్షణంలో చూసినా అతని కొట్టు జనులచే కిటకిట లాడుతునే ఉండేది. మధ్యాహ్నం బోజన సమయంలో మాత్రం ఒక గంటసేపు మూసివేయబడి ఉండేది.

ఒకనాడు సరిగా మిట్టమధ్యాహ్న కాలంలో వర్తకుడు అంగడిమూసి భోజనం చేయటానికి లోపలికెళ్ళగానే కిటికిలో నుండి ఒక కోతి అంగడిలో ప్రవేశించింది. అది నాలుగుప్రక్కల పరికించి అక్కడ ఎవరూ లేరని గ్రహించింది. ఆ కోతి నిర్భయంగా తన పని కొనసాగించింది. తట్టలు, బుట్టలు అన్నీ వెదికింది. ఏమీ దొరకలేదు. ప్రక్కనే ఒక పెద్ద ఇనుప కూజా కనిపించింది. దాని మూత పడవేసి, దానిలో చేతిని ప్రవేశపెట్టింది. ఇక దాని సంతోషమేమని చెపాలి! అందులో జీడిపప్పు తాజా సరుకు ఉంది. వానరము గుప్పెట నిండా దానిని తీసుకుని చేతిని బయటకు లాగింది. కాని చేయి రాలేదు. గుప్పెట పెద్దదిగా, కూజా మూత సన్నగా ఉండటం చేత చేయి బయటకు రాలేదు. ఎన్నో తంటాలు పడింది. భగీరథ ప్రయత్నం చేసింది. కాని చేయి బయటకు రాలేదు. చేతిలో జీడిపప్పు ఉన్నంతవరకు గుప్పెట పెద్దగా ఉండబట్టి కూజా యొక్క సన్నమూతిలో ఆ చేయి పట్టదు. పప్పు వదిలివేస్తే చేయి ధారాళంగా బయటకు వస్తుంది. కానీ ఆ కోతికి పప్పు మీద ఆశ చావనందున, వాసన బలంగా ఉన్నందున అది పప్పును వదలటానికి యిష్టపడలేదు. చేయి బయటకు రానేలేదు.

ఆ వానరానికి ఏం చేయాలో తోచక ఆ చేతిని ఈడ్చుకుంటూ మెల్లగా నడవ సాగింది. కోతి కదలగానే కూజా క్రిందపడి కదిలింది. ఆ శబ్దం విని వర్తకుడు అంగడిలోకి ప్రవేశించాడు. కోతి యొక్క రాద్ధాంతమును చూసి, ఒక

పెద్ద దుడ్డుకఱ్ఱతో దాని వీపుమీద రెండు దెబ్బలు వేశాడు. కాని కోతి పప్పును వదలలేదు. మరి రెండు దెబ్బలు పడ్డాయి. అయినా ఆ కోతి విడువలేదు. అప్పుడు వర్తకుడు మరి కొందరి సహాయముతో కోతియొక్క చేతిని బలాత్కారముగా బయటకు లాగి కోతిని దూరంగా వెడలగొట్టాడు.

కోతి శరీరం గాయాలతో నిండిపోయింది. ఆ బాధను అది కొని తెచ్చుకుంది. బాధకు కారణం విషయాశయే. విషయ వాసనయే పాపం! పప్పు మీద ఆసక్తి ప్రాణానికే ముప్పును తెచ్చింది.మొదటనే ఆ పప్పును వదిలివేస్తే చేయి కూజా నుండి సులువుగా బయటకువచ్చేది. కాని ఆ కోతి తన ఆశను చంపుకోలేక ప్రాణానికే ముప్పు తెచ్చుకుంది.

అట్లాగే జీవుడు దృశ్యవస్తు సముదాయంపైన, బంధుజాలముపైన అట్టి మమకారాన్ని పెంచుకొని, ఆశలను ద్విగుణీకృతం చేసుకుని, అట్టి ఆశాజాలంచేత బంధింపబడి, మృత్యుదేవత ఆసన్నమైననూ, యమధర్మరాజు ప్రహారములు సలుపుతున్ననూ, వారిపై మమత్వాన్ని వదలలేకుండా ఉన్నాడు. తత్ఫలితంగా మరల పుడుతూ, చస్తూ జనన మరణ ప్రవాహంలో తగుల్కొని నానాయాతనలను అనుభవిస్తున్నాడు.

దృశ్య పదార్ధములు నశ్వరములని, పరిపూర్ణ ఆనందాన్ని యివ్వలేవని తెలిసికొని వాటిపై విరక్తి కలిగి, శాశ్వత పరమాత్మను ఆశ్రయిస్తే, జీవుడు యమబాధ నుండిఎప్పుడో తప్పించుకుని ఉండేవాడు. అనంతానందమును అనుభవించేవాడు. కాని బహుజన్మార్జిత విషయ సంస్కారము, విషయవాసన అతనికి అడ్డుపడుతోంది. జీవుని దుఃఖానికి కారణం అదే. కాబట్టి ప్రయత్న పూర్వకంగా దానిని తొలగించుకొని జీవుడు పరమానందాన్ని అనుభవించాలి.

*నీతి - కథలోని కోతివలె మానవుడు ఆశలను పెంచుకొనకుండా, విషయాసక్తిని బలపరచకుండా, తత్త్వవిచారణచే దృశ్యవస్తువుల యొక్క క్షణికత్వమును, దుఃమిశ్రితతత్త్వమును బాగా తెలుసుకొని, వాటి యెడల విరాగము కలిగి, శాశ్వత పరమాత్మపై భక్తిని పెంచుకోవాలి.*

*

# జ్ఞాన నేత్రం

– మల్లిప్రియ

శ్రీహనుమత్కాళీ వరప్రసాద బాబూజీ మహరాజ్ కలియుగ మహాత్మ్యాన్ని గురించి జ్ఞాననేత్రం తెరుపవలసిన అవసరాన్ని గురించి ఒకానొక సత్సంగ సమావేశంలో యిలా వివరించారు.

కలియుగంలో మానవుడు సందేహ ప్రాణియైనాడు. భగవంతుడు సాకారుడు అని చెప్పినా, నిరాకారుడు అని చెప్పినా నాస్తికుడు నమ్మడు. భగవంతుడు సాకారుడని శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడిగా జన్మించాడని శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీశంకరాచార్యుల వంటి మహనీయులు భగవంతుని అంశతో జన్మించారని చెబితే నాస్తికుడు యిలా అంటాడు ' అతనికీ మనలాగే రెండు చేతులూ రెండు కాళ్ళూ ఉన్నాయి. మనలాగే తింటున్నాడు. నిద్రిస్తున్నాడు కదా!' ఇక దేవుడు నిరాకారుడని చెబితే ' కనిపించని దేవుడిని ఎలా నమ్మటం?' అంటాడు నాస్తికుడు. ఇదంతా కలియుగ ప్రభావం. అయితే వీటికి సమాధానాలు ఉన్నాయి. ఇక 'దేవుడు ఎక్కడ ఉన్నాడు?' అని అడిగితే, 'దేవుడు ఎక్కడ లేడో ముందు చెప్పండి' అన్నాడు వివేకానందుడు. ప్రహ్లాదుడికి స్థంభంలో కూడా కనిపించాడు కదా!

ప్రక్కనే గల రెండిళ్ళల్లో రేడియోలు ఉన్నాయి. ఒక యింటిలో రేడియో పెడితే పాటలు వినవస్తున్నాయి. ఒక యింటిలో రేడియో పెట్టలేదు. అంతమాత్రం చేత రేడియోలో పాటలు రావటం లేదని చెప్పటం తప్పుకదా! అలాగే అజ్ఞానం చేత మనకు కనిపించని అంతమాత్రాన దేవుడు లేడు అనటం అవివేకం కదా!

'మరి ఉంటే దేవుడు ఎందుకు కనిపించడు?' ఆలోచించండి. రేడియోని జాగ్రత్తగా త్రిప్పాలి. పాయింట్ సరిగా ఉంటేనే విజయవాడ వస్తుంది. మరొక చోటుకి త్రిప్పితే మరేవో పాటలు వినిపిస్తాయి. అలాగే ప్రహ్లాదుడు, ధృవుడు మొ॥గు వారి మార్గాన్ని అనుసరించండి. రేడియోని సరిగా త్రిప్పండి. తప్పక భగవంతుడు మీకు యీ జన్మలోనే సాక్షాత్కరిస్తాడు.

భార్యాపిల్లలను వదిలివేసి, అందరూ సన్యసించవలసిన పనిలేదు. మన పనులన్నీ మనం చేసుకుంటూనే దృష్టిమాత్రం భగవంతునిపై ఉంచాలి. ఇది సాధ్యమా? ఎందుకు సాధ్యం కాదు?

*

వ్యాసాశ్రమము ఏర్పేడులో శ్రీదండి నిర్మలానందగిరి స్వాములవారితో శ్రీమాతాజీ





## ఆషాఢ పూర్ణిమనాడు బృందావనంలో శ్రీసద్గురుపాదపూజ దృశ్యాలు





(గత సంచిక తరువాయి)

# అపరోక్షానుభూతి

-పరాశర ప్రసాద్

గ్రంథపఠనం ద్వారా గ్రంధులు గట్టిపడతాయి గాని విచ్ఛిన్నమవ్వవు. యోగ సమాధి తాత్కాలిక ఆనందాన్నిస్తుంది. వాసనలు బీజరూపంలో ఉంటాయి. వాసనలు రహితం కావు. బుద్ధిలో రజో తమోగుణ వాసనలున్నంత వరకు జ్ఞానము సిద్ధించదు. పునాదిలేని భవనము కూలిపోతుంది. వైరాగ్యము, వివేకము లేని వేదాంతము వట్టి శుష్కవేదాంతము. ధ్యానము, ప్రాణాయామము అనేవి ఎన్ని సాధనలు చేసినా విచారణ లేకుండా జ్ఞానము సిద్ధించదు.

ధ్యానప్రక్రియలో కలిగే సంకల్ప వికల్పాలను విచారణ ద్వారా రహితం చేసుకోవచ్చు. కొంతమంది సాధకులు శ్వాసమీద దృష్టి నిలుపుతారు. అది తప్పు పట్టవలసిన పని లేదు. శ్వాస అనే ప్రక్రియ జడము. శ్వాస మీద ధ్యాసపెట్టి శ్వాసకి కారణం ఏమిటి? అని విచారణ చేస్తే దేహభావన నశించి నీవెవరవో తెలియజేస్తుంది.

వృత్తులు రహితమై వాటికి సాక్షిగా ఉన్నవాడు గురుపుత్రుడు. గురుపుత్రునకు కర్మ చేసినా, సాధన చేసినా బంధన లేదు.సాధకుడు తరచుగా నా మనస్సు బాగాలేదనో, బాగా ఉందనో చెపుతాడు. అలా చెప్పిన వాడెవరో గుర్తించగలిగితే అదే జ్ఞానం. సాధకుని ఏదైనా ప్రశ్నిస్తే నాకు తెలియదు అనో తెలుసు అనో అంటాడు. తెలుసు, తెలియదు అని గుర్తించి చెప్పింది ఎవరో గమనించాలి. తెలియదు అని తెలుసుకున్న వాడు అజ్ఞాని ఎలా అవుతాడు? అసలు అజ్ఞానం ఎక్కడిది? చీకటి ఉంది. మరి లైటు వేసినప్పుడు చీకటి ఏమైనట్లు? ఒక వస్తువుగాని, ఒక వ్యక్తిగాని ఇక్కడ లేదనో, లేడు అనో అంటే ఎక్కడైనా ఉండాలి కదా! లైటు వేయగానే చీకటి ఏమైంది? అక్కడ లేకపోతే ఎక్కడికి వెళ్ళినట్లు?

శబ్దం ద్వారా అజ్ఞానం కలుగుతుంది. శబ్దం ద్వారానే అజ్ఞానం పోతుంది. సంసారమనేది భ్రాంతి. దాని ద్వారా కలిగే దుఃఖము భ్రాంతి. అది పోవాలనుకోవడం అంతకన్న భ్రాంతి. గురువాక్యము నందు విశ్వాసము పెట్టుకుంటే భ్రాంతి లేదు. ఒకవ్యక్తికి దాహం వేసింది. కొలనులో దిగాడు దోసిళ్ళతో నీరు తీసుకున్నాడు. త్రాగేశాడు. తీరా నీరు త్రాగిన తరువాత గుర్తించాడు. నీటితోపాటు బల్లిని మింగేశానని బెంగ పెట్టుకున్నాడు. దిగులుచెందాడు. వికారం కలిగింది.

ఒక వైద్యుని సంప్రదించాడు. వైద్యుడు విషయాన్ని అవగాహన చేసుకున్నాడు. కొలను ప్రక్కన ఉన్న చెట్టుపైనున్న బల్లి ప్రతిబింబము ఆ వ్యక్తి త్రాగిన నీటిలో పడి

బల్లిని మ్రింగానని భ్రాంతి చెందినట్లు గ్రహించాడు. ఆ భ్రాంతి తొలగాలి. అప్పుడే ఆ వ్యక్తికి ఉపశమనము.

వైద్యుడు ఆ వ్యక్తికి మత్తుమందు ఇచ్చి వమనం చేయించాడు. వమనం చేసినదాంట్లో ఒక చనిపోయిన బల్లి ఉండేటట్లు చేశాడు. ఆ వ్యక్తికి ఉపశమనం కలిగింది. భ్రాంతి తొలగిన వెంటనే శాంతి. బ్రహ్మం అభిన్నం, అతీంద్రియం, అవ్యయం సాక్షి. రాగద్వేషాలు లేనిదే ఉదాసీనమైనది మార్పులేనిది నిత్యము, శాశ్వతము, చేతనమైనది. రాగద్వేషాలు లేని పరిపక్వమైన మనుస్సుతో గురుమూర్తియందు భక్తి శ్రద్ధలతో ధ్యానిస్తూ విచారణ చేసే సాధకునికి అపరోక్షానుభూతిని సద్గురుమూర్తి ప్రసాదించెదరు గాక!

సమాప్తమ్

త్రివేది ఐసి.యస్. ఇంటర్వ్యూ అయి లండన్ నుంచి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఎవరో మాక్స్ ముల్లర్‌ని కలుసుకోమన్నారు. మాక్స్ ముల్లర్ ఒక శబ్ద వ్యుత్పత్తి కోసం స్ఫురించక తంటాలు పడుతున్నాడు. త్రివేది తనకు సహాయపడతాడేమో అని ఆశపడ్డాడు. అతడు ఇండియాలో ఏం చెయ్యాలనుకుంటున్నాడన్న ప్రశ్నకు, ఐ.ఎ.యస్ ఆఫీసర్‌గా చెయ్యబోయే పదవిలో హెూదా గురించి చెప్పాడు.

"ఆ తరువాత ఏం చేస్తావు?"

'వివాహం.'

"ఆ తరువాత?"

'సంతానం'

"ఆ తరువాత?"

"వాళ్ళ పెళ్ళిళ్ళు"

"ఆ తరువాత?"

'రిటైర్‌మెంట్'

"ఆ తరువాత?"

'మనవళ్ళతో ఆడుకోవటం? '

"ఆ తరువాత?"

'చస్తాను ! '

"అంతమాత్రానికి ఇంత గోలెందుకు? మీ దేశంలో చావులేని చదువున్నదిట కదా! అది నేర్చుకోరాదూ?" త్రివేది మారిపోయాడు!

# ఆషాఢ పూర్ణిమనాడు శ్రీమాతాజీవారి సందేశం

-రమణ ప్రసాద్

శ్లో॥ న గురోరధికం నగురోరధికం। న గురోరధికం న గురోరధికం।
శివ శాసనతః। హరి శాసనతః। విధి శాసనతః। గురు శాసనతః॥

అని చెప్పింది గురుగీత. అన్నిటికన్నా గొప్పది ఒకటున్నది. అదే అన్నిటిని నడిపిస్తుంది. అదే గురుశక్తి. గురుభక్తుడైనవాడు గురుపూర్ణిమనాడు తనదైన వస్తువుకోసం వెంటపడి వస్తాడు.

అమావాస్య తరువాత చంద్రుడు ఒక్కొక్కరోజుకూ పెరుగుతూ పూర్ణిమనాడు పూర్తిగా ప్రకాశిస్తాడు. అలాగే ఏ హృదయం గురుదేవుని ముందుగా మెండుగా నింపుకుని ఉంటుందో ఆ జీవికి అది నిజమైన గురుపూర్ణిమ. గురువు దిక్సూచివంటి వాడు. ఓడ నడిపేవాడికి దిక్సూచి మార్గాన్ని ఎలా సూచిస్తుందో, అలా గురుదేవులు మన వెంట ఉండి మనలను గమ్యానికి చేరుస్తారు.

మనం ఉదయం నుంచీ గురుకార్యంలో ఉన్నాము. కాలాన్ని మరచి చేసేది మన నిత్యకాలంలో జమవుతుంది. న గురోరధికం అని బ్రహ్మ శాసించాడు. శివుడు శాసించాడు. మరి మనస్సు కూడా శాసించాలి. మహాత్ములు ఏ మార్గాన్ని మనకు సూచించారో ఆ మార్గంలో నడక సాగించాలి. గురుబోధామృతాన్ని మాటిమాటికి మననం చేస్తూ విచారణలో ఎంత లోతుకి వెళితే, అంత దివ్యానుభూతి లభిస్తుంది. ఎంతో విలువైన జీవితాన్ని మనకు గురుదేవులు ప్రసాదించారు. సత్యవస్తువు తెలుసుకోమని ప్రబోధించారు.

గురుదేవుల అనుగ్రహం పొందాలంటే గురుశుశ్రూష చేయాలి. అది నాలుగు విధాలు. ధన శుశ్రూష, అంగ శుశ్రూష, భావ శుశ్రూష, ఆత్మ శుశ్రూష.

ధన శుశ్రూష అంటే గురువుకి ధనం అర్పించటం కాదు. వారిచ్చిందే మనం అనుభవిస్తున్నాము. నా అనుగ్రహం వల్లనే వచ్చిందిరా యీ సంపద. నువ్వు నాకిచ్చేది ఏమిటి? అంటారు గురుదేవులు. వారి అనుగ్రహంతో లభించినదానికి తృప్తిపడి కృతజ్ఞతా భావంతో మెలగాలి. అంగ శుశ్రూష అంటే ' నీ హృదయాన్ని శుద్ధి చేసుకో. నీ హృదయం లోనే ఉన్నాడు భగవంతుడు. నీ హృదయం లోనుంచి వచ్చే మాట పవిత్రంగా ఉండాలి. దానివల్ల ఆకాశం పవిత్రమవుతుంది. భావ శుశ్రూష అంటే ఏది జరిగినా అది గురు అనుగ్రహం వల్లనే జరిగిందని భావించాలి. ఆత్మశుశ్రూష అంటే గురుతత్త్వమాత్మ

కనుగొనకున్న కల్గునే నిరతిశయంబైన పరమపదము అని శ్రీసీతారామాంజనేయ సంవాదంలో చెప్పబడింది. ఎటు చూసినా నా ప్రభువే ఉన్నాడు అని గుర్తించు. నీలో ప్రేరణ యిచ్చేది ఆయనే.

ఆశా మోహాలను రహితం చేసేదే ఆషాఢ పూర్ణిమ. ఈ ఆశ అనేది అడ్డు పడుతుంది.

ఆశయా బధ్యతే లోకే కర్మణా బహుచింతయా।
ఆయుః క్షీణం న జానాతి । తస్మాత్ జాగ్రత జాగ్రత ॥

బహు చింతలతో చేసే కర్మల వల్ల మానవుడు బంధింపబడతాడు. కాబట్టి జాగరూకతతో నిన్ను నీవు గుర్తించు అని ప్రబోధిస్తున్నారు శ్రీగురుదేవులు. కాలాతీతమైన వస్తువు మనదై ఉన్నది. దానికి మనమందరం వారసులం! అటువంటి గురుసేవలో పాల్గొని గురుతత్త్వాన్ని జుర్రుకుందాం! అటువంటి శక్తిని, భక్తిని, ఆత్మజ్ఞానాన్ని గురుపాదుకలు మనకు ప్రసాదించెదరు గాక!!

*

*'శ్వ ' అనగా రేపు. రేపటి వరకు ఉండేది అని అర్థం. శ్వర్థము 'న+ శ్వత్థం' = అశ్వత్థం అంటే రేపటి వరకు కూడా ఉండనిది. అనిత్యమూ, క్షణికమూ అని దీని అర్థం. "ఇది రావి చెట్టు. అంతా తొఱ్ఱ. తినటానికి పళ్ళు ఉండవు. వాసన చూడటానికి పువ్వులు ఉండవు. దీని ఆకులు కూడా దేనికీ పనికిరావు" జ్ఞానేశ్వరుడు.*

*వేదాంతుల పరిభాషలో యీ జగత్తు దృష్ట నష్ట స్వరూపం కలది. నియాన్ అక్షరాలు ఒకప్రక్క పుడుతూ ఉంటే మరొక ప్రక్క నశించిపోయినట్లు.*

*రావిచెట్టుకు 'చలదళ ' మనే యింకో పేరు ఉంది. దీని ఆకులు నిరంతరం చలిస్తూనే ఉంటాయి. మానవుడి కోరికలూ, జీవితమూ కూడా అంతే.*

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

–గత సంచిక తరువాయి

–స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

## వడాలి పిన్నిగారితో శ్రీబాబు

పరశురామయ్యగారి మరదలు సుబ్బమ్మగారు (వడాలిపిన్నిగారు) పరశు రామయ్యగారి వద్ద మూడు దీక్షలను పూర్తిచేసి శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారి వద్ద పూర్ణదీక్షను పొందారు. ఆమెకు గల తీవ్రమైన తత్త్వ జిజ్ఞాసను గుర్తించిన శ్రీబాబు యనమదుర్రులో తాము పరశురామయ్యగారితో తత్త్వ విచారణ చేసిన సమయాలలో శ్రద్ధగా శ్రవణం చేసే భాగ్యాన్ని ఆమెకు కలిగించారు. పిన్నిగారు యీ సదవకాశాన్ని పరిపూర్ణంగా వినియోగించుకుని ఒక ప్రక్క తమ సంసారమును చక్కదిద్దుకుంటూనే, నిరంతర శ్రవణ మననాదుల ద్వారా చక్కని ఆత్మతత్త్వ పరిజ్ఞానాన్ని పొంది, శ్రీబాబు అభిమానానికి, అనుగ్రహానికి పాత్రులు కాగలిగారు.



ఆశ్రమ స్థాపనానంతరం పిన్నిగారికి వారి భర్తతోపాటు ఆశ్రమంలోనే స్థిరనివాసం ఏర్పరచి, ఆమె ఆధ్యాత్మిక పురోభివృద్ధికి ముఖ్య ఆలంబనమును శ్రీబాబు ప్రసాదించారు. ఆమె భర్త కృష్ణయ్యగారు పరమపదించిన సమయంలో ఆమె కంటతడి పెట్టలేదు. విచారమునకు బదులు శ్రీబాబు ఆమెలో విచారణాగ్నిని రగిల్చారు. మాతృగర్భస్థం కావటం, పుట్టటం, పెరగటం, ఎన్నో మార్పులు చెందటం, క్షీణించటం. చివరకు పతనం కావటం ఈ ఆరు దశలూ శరీర ధర్మములని, కాని శరీరి అయిన ఆత్మ వస్తువు మాత్రం మార్పు లేనిదని, అవినాశి అని, ఆమె తమను పరామర్శింప వచ్చిన వారందరికీ చెప్పారు. శ్రీబాబు అది విని "ఆమె గట్టిగింజగాని, తాలుగింజ కాదు" అని ఆనందించారు.

శ్రీబాబు ఎప్పుడైనా భక్తులతో సద్విచారణ జరుపుతున్నప్పుడు, ఆమె ఆయాసపడుతూ మేడ ఎక్కి వినాలనే ఆసక్తితో వచ్చేది." ఆ ముసలావిడని పైకి రానీయకండి. ఇక్కడకు వచ్చి విని ఏమి పొందాలనుకుంటోందో, అది క్రిందనే ఆవిడ ఉన్న చోట కూడా ఉన్నదని, అక్కడే పొందమని చెప్పండి" అనేవారు శ్రీబాబు.

అక్కడున్న వారందరూ "అయ్యో! పిన్నిగారిని శ్రీబాబు అలా పంపించి వేస్తున్నారే" అనుకునేవారు. కాని పిన్నిగారు మాత్రం "నేను ఆయాసపడటం వారు సహించలేరు 'ఏ సత్య వస్తువును గురించి, తెలుసుకోవాలని, దర్శించుకోవాలని నువ్వు పైకి పరుగెత్తుకొని వస్తున్నావో, అది క్రిందనే నువ్వున్న చోట కూడా ఉన్నది కదా! చక్కగా అక్కడ కూర్చుని విచారణ చేసుకో. అనవసరంగా పైకి వచ్చి. ఆయాసం తెచ్చుకోకు' అని ఆయన భావం. ఆయనకు నా మీద ఉన్న ప్రేమ అలాంటిది" అనుకుంటూ నవ్వుకుంటూ క్రిందికి వెళ్ళిపోయేవారు.

ఒకసారి నవరాత్రి సమావేశంలో శ్రీబాబు ఆమెను నిలుచోమని, "ఈవిడ నాకు ఒకప్పుడు అన్నం పెట్టిన విస్తరిని నాతోనే తీయించి శుద్ధి పెట్టించిన పెద్దమనిషి. మహాభక్తురాలు. అవునో, కాదో ఆమెనే అడగండి" అన్నారు. ఆమె నిలబడి లెంపలు వాయించుకుంటూ "నేను ఆ మహాపరాధం చేసినమాట నిజమే బాబూ! అయినా దయామయులైన తమరు ఆ పాపకర్మ నివృత్తికోసం నాకీ ఆశ్రమ నివాస భాగ్యాన్ని ప్రసాదించారు. నాలో నుండి దేహాత్మభావన తొలగించటానికే తమరు ఎంతో దయతో నన్ను యిలా క్షాళన చేస్తున్నారు. ధన్యురాలిని బాబూ!" అని ఆమె ఎంతో సంతోషంతో అనేవారు. ఇలా ఎన్నోసార్లు ఆమెను నిలబెట్టి ఆమెకు దేహాభిమానం లేదని ఋజువు చేశారు శ్రీబాబు.

శ్రీబాబు అవతార పరిసమాప్తి అనంతరం కూడా ఆమె తన స్థితప్రజ్ఞత్వమును కోల్పోక సద్గురు స్వరూపం శాశ్వతమైనది, దానికి పతనమే లేదని శ్రీబాబు ఆ కనబడే శరీరానికి మాత్రమే పరిమితమైన వారు కారని, వారి దర్శనమును మనం ఎక్కడ కోరితే అక్కడ, ఎప్పుడుపడితే అప్పుడు పొందవచ్చునని చెప్పి, భక్తులను ఓదార్చారు.

జిజ్ఞాసాపరులైన భక్తులను తమ వద్ద కూర్చోబెట్టుకుని, గంటల తరబడి విసుగూ అలుపూ లేకుండా పిన్నిగారు తత్త్వ చింతన చేసేవారు. నిద్రను ఆహారమును పట్టించుకునేవారు కాదు. ఎప్పుడూ నవ్వుతూ శ్రీబాబు మాటలే చెబుతూ వారి దివ్యలీలలనే స్మరించుకునేవారు.

అనివార్య సాంసారిక కారణాల వలన వారిని చివరి రోజులలో వారి ఏకైక కుమారుడు హైదరాబాదు తీసుకొని వెళ్ళారు. అలా తనువు తాత్కాలికంగా ఆశ్రమానికి దూరమైనా, ఆమె మనస్సు మాత్రం విడదీయరాని విధంగా ఆశ్రమానికి, శ్రీబాబుకు పెనవేసుకొని పోయింది. చివరకు ఆ తనువు కూడా మళ్ళీ ఆశ్రమానికే చేరుకొని ఆశ్రమ స్వరూపులైన శ్రీబాబులో కలిసిపోయింది.

*

# రావణుని పూర్వ జన్మ వృత్తాంతము

మూలం - తులసీరామాయణం

సంకలనము - జ్ఞానానంద స్వామి

పూర్వకాలంలో కేకయ దేశాన్ని సత్యకేతు మహారారజు పరిపాలిస్తూ వుండేవాడు. అతను చాలా ధర్మ పరాయణుడు. ప్రజలను కన్నబిడ్డ కన్నా మిన్నగా చూసుకునేవాడు. అతనికి ఇద్దరు పుత్రులు. ప్రతాప భానుడు, అరిమర్ధనుడు. ప్రతాప భానుడు అంటే సూర్యునివంటి శక్తి కలవాడని, అరిమనర్ధనుడు అంటే శత్రువులను వినాశనం చేసేవాడని అర్థం.

ఆధ్యాత్మిక పరిభాషలో మనం ప్రతాపభానుని జ్ఞానముగాను, అరిమర్ధనుని సత్కర్మగాను తీసుకోవచ్చు. కారణం పెద్దలు సామాన్యంగా జ్ఞానాన్ని సూర్యునితో పోలుస్తారు. ఈ జ్ఞానం కూడా సిద్ధి జ్ఞానం, మరొకటి సాధన జ్ఞానం. సాధన జ్ఞానం కొద్దిగా కష్టతరమైనది. ఉదాహరణకు సూర్యుణ్ణే తీసుకొందాం. సూర్యుడు ప్రచండంగా ప్రకాశిస్తున్న సమయంలో మేఘం అడ్డువస్తే సూర్యకాంతి కొద్ది క్షణాలపాటు మనకి కనబడదు. సూర్యుడు మహాకాంతివంతుడు.అంధకారాన్ని పటాపంచలు చేయగల మహాశక్తిమంతుడు. కానీ, మేఘం అడ్డువచ్చేసరికి, అతని కాంతి కొద్ది క్షణాలపాటు తెరమరుగు పడక తప్పదు. ఇదే విధంగా కొంతమంది శక్తిమంతులుగా ఉంటారు. కానీ కర్మవశాత్తు దుష్టసాంగత్యంలో ఐహిక సుఖాలకు లోనయ్యే సరికి వారిలోని జ్ఞానం కొద్దికాలంపాటు తెరమరుగు అవుతుంది.

ఇక్కడ ప్రతాపభానుడు కూడా ఈ సాధన జ్ఞానానికి ప్రతీక అని మనం చెప్పుకోవచ్చు. కారణం మాహాజ్ఞానవంతుడైన ప్రతాపభానుని జీవితంలో కొన్ని దుర్లక్షణాల కారణంగా అతనికేకాక అతని వంశానికి, అతని పరివారానికి కూడా నిశాచర జన్మ లభించింది.

ప్రతాపభానుని సోదరుడు అరిమర్ధనుడు శత్రువులను నాశనము చేసి సత్కర్మకు ప్రతీక అయ్యాడు. సత్కర్మ ద్వారా పాపాన్ని వినాశనం చేయవచ్చు. ఈ అరిమర్దనుడు ప్రతాప భానునికి అనుగామి, అంటే కర్మ (అరిమర్ధనుడు), జ్ఞానానికి (ప్రతాపభానుడు) అనుగామి అయిన నాడు జీవితంలో అంతా సఫలత్వమే లభిస్తుంది.

ఇకపోతే ధర్మరుచి. ఇతడు సత్యకేతు మహారాజు పుత్రులైన ప్రతాపభానునికి, అరిమర్దనునికి మంత్రి. ఎంత సుందరమైన పేరు ఈతనిది? ధర్మరుచి అంటే ధర్మ ం

పట్ల రుచి అంటే ఆసక్తి కలవాడని కదా అర్థం. ధర్మరుచి హరిభక్తుడు. అతను రాజుకు అనేక ధర్మసూత్రాలను తెలుపుతూ రాజు మన్ననలను పొందుతూ ఉండేవాడు.

సత్యకేతు మహారాజు మరణానంతరము ప్రతాపభానుడు రాజు అయ్యాడు. ప్రతాపభానుడు తన భుజ బలంతో తన సోదరుడైన అరిమర్ధనుని సహకారంతోను దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కావిస్తూ ఈ భూప్రపంచాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలసాగాడు. అంతేకాదు ప్రతాపభానుడు మహాజ్ఞాని. పురాణాలలో ఎన్ని రకాల యజ్ఞాలనైతే తెలిపారో వాటన్నింటిని ప్రతాపభానుడు ఎంతో శ్రద్ధాసక్తులతో ఆచరించేవాడు. ప్రతాపభానుని పరిపాలనలో ప్రజలు దుఃఖమనేది ఎరుగక ధర్మవర్తనులై ఆనందంగా నివసించసాగారు.

ఒకరోజు ప్రతాపభానుడు తన పరివార సహితంగా వేటకై వింధ్యపర్వతాలలోని దట్టమైన అరణ్యాలలోకి వెళ్ళాడు. ఎన్నో క్రూరజంతువులను వేటాడాడు. కానీ మనస్సుకి తృప్తి కలుగలేదు. ఇంతలో ఒక వరాహం అతని కంటపడింది. ప్రతాపభానుని కన్నులకు ఆ వరాహం ఎంతో అందంగా కనిపించసాగింది. వరాహం చాలా బలిష్టంగా, విశాలంగా ఉంది. దాని కోరలు చంద్రకాంతిలా అందంగా మెరిసిపోతున్నాయి. నీల పర్వతాన్ని తలపింప చేస్తున్న ఆ వరాహాన్ని ఎలాగైనా సరే తన కైవసం చేసుకోవాలనే తపనతో రాజు దానివెంటపడి తరమసాగాడు.కానీ ఆ వరాహం తన ప్రాణాలను రక్షించుకోవటానికి వాయువేగంగా పరుగెత్తసాగింది. ప్రతాపభానుడు కూడా దానితో సమానంగా తన అశ్వాన్ని నడిపిస్తూ , తన శరపరంపరతో దాన్ని గాయపరచటానికి ప్రయత్నింపసాగాడు. కానీ ఆ వరాహం, ప్రతాపభానుని ప్రయత్నాలను వ్యర్థపరుస్తూ అతనికి అందకుండా తప్పించుకుని, అరణ్యంలోకి చొచ్చుకొనిపోయింది.

దానితో రాజుకు ఏమి చేయటానికి పాలుపోలేదు. కారణం అంతటి భయంకరమైన కీకారణ్యంలోనికి ఒంటరిగా వెళ్ళటమనేది దుస్సాహసమే అవుతుంది. అదీగాక ఆకలి దప్పికలు అతనికి క్లేశాన్ని కలిగించసాగాయి. అతని అశ్వం కూడ అలసి యిక ముందుకు పోలేని అసహాయ స్థితిలో ఉంది. ఒంటరిగా అరణ్యంలో తిరుగుతున్న ప్రతాపభానుడికి దైవవశాత్తుగా ఒక పర్ణకుటీరం అగుపడింది. ప్రతాపభానునికి కనబడిన ఆ కుటీరం ఒక రాజుది. దుష్టుడు, ప్రజలను హింసించే అతని రాజ్యాన్ని ప్రతాపభానుడు జయించాడు. ప్రతాపభానునితో పరాభవాన్ని పొందిన ఆ రాజు అవమానాన్ని భరించలేక, వింధ్యపర్వతాలలోకి కీకారణ్యంలో తాపస వేషధారియై నివసిస్తున్నాడు. ప్రతాపభానుడు చేరుకున్నది అతని కుటీరానికే.

-సశేషం

## విష్ణు కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# 3.తులసీదాసు

"మూర్ఖుడా! లేచి దూరంగా పో. లేకపోతే నీ ప్రాణాలు దక్కవు" అన్నాడు ఆంజనేయస్వామి. ఓహో! నన్నుదూరంగా పంపి మీరు నెమ్మదిగా జారుకుందామనా!

నేను ఒక్కక్షణమైనా మిమ్మల్నివదలను. ఆంజనేయమూర్తి అతని చర్యలకు విసుగు చెంది చివాలున తేచి తులసీదాసుని క్రింద పడద్రోసి మరొక చోట కూర్చున్నాడు. తులసీదాసు ఆయన దగ్గరకు చేరి, స్వామీ మీరు లోపలకు ఎలా వచ్చారో చెప్పండి అని మళ్ళీ అడిగాడు. నా ఇష్టం వచ్చిన దారిలో వస్తాను, నీకెందుకు చెప్పాలి? కుదురుగా కూర్చుని పురాణ శ్రవణం చెయ్యి లేకపోతే బయటకు వెళ్ళు అని చెప్పి ఆంజనేయుడు పురాణ ప్రసంగం వింటున్నాడు. స్వామీ! మీరు ఎంతదాచినా మీ స్వరూపం నాకు తెలియదనుకున్నారా నీవు ఆంజనేయుడివికావా, నన్ను అనుగ్రహించవా?" అని అడిగాడు తులసీదాసు. "ఓరీ! నన్ను కోతిని చేశావా? నాతో నీకు సరసమా?" అని కొట్టబోయాడు మారుతి. మీరు కోతుల కెల్లా నాధుడవగు హనుమంతుడని మీకు చెప్పాను కానీ, మిమ్మల్ని పరిహసించలేదు. నన్ను మీ శిష్యునిగా అంగీకరించండి మీ శరణు జొచ్చాను" అని సాష్టాంగపడ్డాడు తులసీదాసు.



హనుమన్మూర్తి 'రామా! రామా! వీడెన్ని విధాలజెప్పినా వినటంలేదు ఏంచేయను" అని విచారపడ్డాడు. తులసీదాసు వెంటనే "మీరు ఇప్పుడు ఉచ్ఛరించిన మహాత్ముని దర్శనం చేయాలి అనే కోరికతో మిమ్మల్ని ఆశ్రయించాను. నాయందు కటాక్షం ఉంచి నాకు ఆయన సందర్శనం చేయించండి" అని ప్రాధేయపడ్డాడు. "నీకు పుణ్యం ఉంటుంది, పురాణం అయేదాకా మెదలకుండా కూర్చో తరువాత మాట్లాడుదువుగాని" అన్నాడు ఆంజనేయమూర్తి. "స్వామీ! రామాయణానికి మీరే ముఖ్యకారకులుగా ఉండి కూడా మళ్ళీ వినటానికి కారణం ఏమిటి? ఆ రహస్యం నాకు తెలియచేయండి" అన్నాడు తులసీదాసు.

ఓహో! వీడికి నా రహస్యం తెలిసినట్లుంది, వీడి బారినుండి తప్పించుకోవటం మంచిది" అని పురాణ ప్రసంగం అవగానే బ్రాహ్మణసంఘంలో కలిసి మాయమైనాడు. మర్నాడుకూడా ఇదే విధంగా పౌరాణికుడి ఇంటి ముందు కాపు కాచాడు తులసీదాసు. వేరేదారిలో ఆంజనేయుడు లోపలికి ప్రవేశించి దూరంగా ముసుగు కప్పుకొని పురాణం వింటున్నాడు. తులసీదాసు ఆయనను సమీపించి "నేనెన్నిసార్లు వేడుకున్నా నామీద దయ కలుగుటలేదా?" అన్నాడు.

హనుమంతుడు "శ్రీ రామమూర్తి వైకుంఠంలో ఉన్నాడు. కూర్చున్నచోటనే భగవంతుడిని ఎలా సేవించగలవు, నాముందునుంచి వెళ్ళు" అన్నాడు. తులసీదాసు "మీ కటాక్షమున్నచో భగవద్దర్శనం ఒక గొప్ప కార్యమా? మిమ్ము ఆశ్రయించిన వానికి సాధ్యముకానిది ఉన్నదా? నీ నామం ఒక్కసారి స్మరిస్తే చాలు సకల భయాలు తొలగుతాయి. నానేరములను మన్నించి నన్ను రక్షించవా" అని ప్రార్ధించాడు. మారుతి అతనిని చురచురచూసి మెడపట్టి నేలమీదపడేటట్టుగా తన్నాడు. తులసీదాసు మెల్లగాలేచి "నీవు నన్ను తన్నావు, నీ దేహం పవిత్రమైంది. నిన్ను వదలను" అన్నాడు. "నీవు చాలా మంచివాడవు, పురాణ శ్రవణం సమయంలో ఎవ్వనితోనూ మాట్లాడకూడదు. రామనామ స్మరణం, రామకథా శ్రవణం భవబంధ ముక్తి మార్గాలు. భక్తి శ్రద్ధలతో రాముని చరిత్రను విని, అందులోని పరమార్ధమును గ్రహించు." అన్నాడు.

తులసీదాసు "అయితే రామ దర్శనం చేయిస్తారా" అని అడిగాడు. హనుమంతుడు మౌనంవహించాడు.

తులసీదాసు మళ్ళీ మట్లాడటం మొదలుపెట్టేసరికి విసుగు చెందిన హనుమంతుడు అచ్చట బ్రాహ్మణులతో చెప్పాడు. వాళ్ళందరూ అతనిని బయటకు వెళ్ళమన్నారు. పౌరాణికుడు "ఆ చిన్నవాడు మహా మూర్ఖుడు, ఈ ముసలివాడు మిక్కిలి కఠినుడు. ఇద్దరూ ఇద్దరే. ప్రసంగం భంగం కాకుండా ఉండాలంటే ఇద్దరినీ రానీయవద్దు. హనుమంతుడు ఆ బ్రాహ్మణులతో "నా మనవి వినండి నన్ను వాడి చేతిలో పెట్టకండి" అని అంటూ వడివడిగా పరుగెడుతూ బ్రాహ్మణులు అందరూ ఒకరిమీద ఒకరు పడేటట్లు చేశాడు. వెనకనే పరుగెడుతున్న తులసీదాసుకు అక్కడనున్న స్తంభాలు, గోడలు తగిలి దేహమంతా గాయపడి రక్తం కారుతోంది. అయినా సరే తులసీదాసు వెంటపడటం మానలేదు. దారిపొడుగునా ముళ్ళు, రాళ్ళు గుచ్చుకొని నెత్తురు ఎక్కువగా కారటం వల్ల స్మృతి తప్పి క్రిందపడిపోయాడు.

హనుమంతుడు, తులసీదాసు వైరాగ్యసంపదకు సంతోషించి, ఇట్టి పరిశుద్ధ చిత్తుడిని చేపట్టకుండా ఉండటం సబబు కాదు. ఇతని కోరిక నెరవేర్చవలసిందే, అనుకొని

ఒక చెట్టు చాటునుంచి తులసీదాసును గమనిస్తున్నాడు. తులసీదాసు సేదతీరి వెళ్ళలేదు. “నీ వెంటే వస్తాను అని నాలుగు వైపులా చూసి హనుమంతుడు కనిపించక చింతాక్రాంతుడయ్యాడు. ఎందుకూ కొరగాని జన్మము వలన ప్రయోజనమేమిటి? రామార్పణంగా దేహాన్ని విడిచిపెడ్తాను అని బండరాయి మీద తల పగుల కొట్టుకొని ప్రాణత్యాగం చేయటానికి సిద్ధపడ్డాడు. ఆంజనేయమూర్తి అతనిని తన చేతులలోకి తీసుకొని “పరమ భాగవత శిఖామణి! నీ అభీష్టాలన్నీ నెరవేర్చటానికి సిద్ధంగా ఉన్నాను. ఏ వరాలు కావాలో అడుగు” అన్నాడు. తులసీదాసు ఆనందపారవశ్యంతో ఆంజనేయునకు ప్రదక్షిణము చేసి, స్వామీ నాకు శ్రీ రామమూర్తి సందర్శనం తప్ప వేరే కోరిక లేదు అన్నాడు. హనుమంతుడు ‘నీ కోరిక సర్వోత్తమమైనదే, ఎన్నాళ్ళనుండో తదేక ధ్యానంతో తపస్సు చేస్తున్న నీకే దర్శనం ఇవ్వని రాముడు నేను చెప్పినంత మాత్రాన దర్శనం ఇస్తాడా ఆలోచించు’ అన్నాడు. స్వామీ నీయందు గల వాత్సల్యం చేత నీ మాట కాదనడు.

ఆంజనేయమూర్తి “నాయనా! నిరంజనుడు, నిర్వికారుడు అయిన భగవంతుడిని చర్మ చక్షువులతో చూడలేవు” అన్నాడు. తులసీదాసు, రూపారూపాలకీ అతీతంగా ఉన్న భగవంతుడు సర్వశక్తిమంతుడు కనుక భక్తులకోరిక ప్రకారము రూపధారణచేసి తన దర్శనభాగ్యాన్ని ప్రసాదిస్తాడు. ఆంజనేయుడు “నీవు చెప్పేది నిజమే అయినా 28 కృతయుగాల క్రిందట జరిగిన శ్రీ రామావతారమును సందర్శింపజేయుటం సాధ్యంకాదు” అన్నాడు. భక్తవత్సలుడైన శ్రీరామునికి ఇది ఒక గొప్పకార్యంకాదు. మీ సహాయం ఉంటే తప్పక నాకు రామ దర్శనం కలుగుతుంది. మీ కటాక్షం ఉండాలి లేకపోతే నా ప్రాణాలు ఇక్కడే విడుస్తాను” అన్నాడు తులసీదాసు.

ఆంజనేయమూర్తి సంతోషంతో “నాయనా! నీ మనశ్శుద్ధిని పరిశోధించటానికి ఇంతవరకు సమ్మతించలేదు. రేపు ఉదయం రాముడిని నీ స్వగృహంలో నే దర్శిస్తావు” అని చెప్పి అంతర్ధానమైనాడు.

–సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL